మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 1-11-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 122 Issue: 122

01 నవంబర్ 2025 - శనివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:18 సూర్యాస్తమయం - సా. 5:41 తిథిః దశమి ఉ. 9:09 వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం శతభిష సా. 6:05 వరకు తరువాత పూర్వాభాద్ర యోగం ధ్రువ రా. 2:010 వరకు కరణం గరజి ఉ. 9:09 వరకు వనిజ రా. 8:21 వరకు వర్జ్యం రా. 12:23 నుండి రా. 1:54 వరకు దుర్ముహూర్తం ఉ. 7:49 నుండి ఉ. 8:34 వరకు రాహుకాలం ఉ. 9:08 నుండి ఉ. 10:34 వరకు యమగండం మ. 1:25 నుండి మ. 2:50 వరకు గుళికాకాలం ఉ. 6:18 నుండి ఉ. 7:43 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:42 నుండి తె. 5:30 వరకు అమృత ఘడియలు ఉ. 11:17 నుండి మ. 12:51 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:36 నుండి మ. 12:22 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com

# ప్రాణం పోతే ₹5 లక్షలు

## ఇల్లు మునిగితే 15 వేల పరిహారం

## పంట నష్టానికి ఎకరాకు 10 వేలు

## వరంగల్ వరదల్లో అధికారుల అలసత్వం



### బాధ్యతలు తప్పితే చర్యలకు వెనుకాడబోం.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టీకరణ.. హనుమకొండ కలెక్టరేట్‌లో సమీక్ష

తెలంగాణలో మొంథా తుపాను కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారంగా ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇళ్లు పూర్తిగా మునిగిపోయిన వారికి తక్షణ ఆర్థిక సహాయంగా రూ.15 వేలు, అదేవిధంగా గుడిసెలు కోల్పోయిన పేదవారికి ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ఇళ్లు కట్టేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే ఎకరా పంట నష్టానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందించాలని ఆదేశించారు. నేడు హనుమకొండ కలెక్టరేట్‌లో వరదలపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.

హనుమకొండ, అక్టోబర్ 31 (ఈవార్తలు): సీఎం మాట్లాడుతూ.. తెలంగాణలో మొంథా తుపాను కారణంగా 12 జిల్లాల్లో తీవ్ర నష్టం జరిగిందని వెల్లడించారు. పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రహదారులకు సంబంధించిన సమగ్ర నివేదికలను వెంటనే తయారుచేసి సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రజాప్రతినిధుల వద్దకు చేరిన నివేదికలను సైతం కలెక్టర్లకు పంపాలని సూచించారు. అన్ని నివేదికలను క్రమపద్ధతిలో సమీకరించి, త్వరలో కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలని చెప్పారు. , తుపాను నష్టాలకు సంబంధించిన కేంద్ర నిధులను రాబట్టుకోవడంలో అలసత్వం చూపవద్దని అధికారులను తీవ్రంగా హెచ్చరించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని తరువాయి 2 వ పేజీలో...

# దోకేబాజ్ కాంగ్రెస్

## అధికార పార్టీకి బుద్ధి చెప్పాలి.. జూబ్లీహిల్స్ నుంచే జైత్రయాత్ర

### 4 లక్షల మంది 4 కోట్ల ప్రజల గోస తీర్చాలి... జూబ్లీహిల్స్‌లో రోడ్‌షోలో కేటీఆర్




రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసిన దోకేబాజ్ కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెబుదాం అని జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. షేక్‌పేట్ డివిజన్‌లో నిర్వహించిన రోడ్‌షోలో కేటీఆర్ పాల్గొని బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు మద్దతుగా ప్రసంగించారు.'కొడుతున్నామా మల్లీ జూబ్లీహిల్స్.. మీ జోష్ ఉత్సాహం చూస్తుంటే గెలుపు పక్కా మెజార్టీ ఏందనేది తేలాలి. మోసం చేసిన దోకేబాజ్ కాంగ్రెస్‌కు బుద్ధి చెబుదాం.

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): సరిగ్గా 2014 జూన్ నెలలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. కేసీఆర్ చావు నోట్లో తలపెట్టి కొట్లాడితే రాష్ట్రం వచ్చింది. నాడు ఏ పరిస్థితి ఉండేనో గుర్తుకు తెచ్చుకోవాలి. 2014లో మనకు రాష్ట్రాన్ని రూ. 85 వేల కోట్ల అప్పుతో అప్పజెప్పారు. నాడు కరెంట్ లేదు. ఇన్వర్టర్ లేని దుకాణం, జనరేటర్ లేని అపార్ట్‌మెంట్ లేదు హైదరాబాద్ నగరంలో. మంచినీళ్ల గోసతో అప్పజెప్పారు. కేసీఆర్ కుటుంబ పెద్దగా ఈ రాష్ట్రం బాగాలేదని చెప్పలేదు. కష్టాలు కన్నీళ్లను తట్టుకుని కేసీఆర్ నిలబడ్డారు. ఎన్ని కష్టాలు, సమస్యలు ఉన్నా వాటిని పరిష్కారం చేసుకుంటూ ముందుకు పోయారు. పదేండ్లలో ఈ రాష్ట్రాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. 2014లో తలసరి ఆదాయం లక్ష

తరువాయి 2 వ పేజీలో...

# కన్నెత్తి చూస్తే ఖతమే



### మాకు దేశ సమగ్రతే ముఖ్యం
### పటేల్ ఆశయాలు నెరవేరుస్తున్నాం
### ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సత్తా
### ఏక్తా దివస్ కార్యక్రమంలో ప్రధాని మోదీ

అహ్మదాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి ఈ సందర్భంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్ వేడుకలు శుక్రవారం దేశవ్యాప్తంగా ఘనంగా జరిగాయి. గుజరాత్ కెవాడియాలోని స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో జరిగాయి. పటేల్ భారీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం పరేడ్‌ను ప్రారంభించి జాతీయ ఏకతా ప్రతిజ్ఞను చేయించారు. అంతకు ముందు.. తన ఎక్స్ ఖాతాలో 'సర్దార్ వల్లభభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా దేశం నివాళులు అర్పిస్తోంది. ఆయన తరువాయి 2 వ పేజీలో...

## ప్రభుత్వ సలహాదారుగా
# సుదర్శన్ రెడ్డి

### ప్రేమ్ సాగర్‌రావుకు సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్



హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి కార్య క్రమాల అమలు సలహాదారుడిగా నియమిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. సుదర్శన్ రెడ్డి కేబినెట్ సమావేశాలకు కూడా ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉంటారు. మంత్రుల నివాస ప్రాంగ ణంలో ఆయన క్వార్టర్ కేటాయించాలని కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. అదే విధంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొ క్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు పౌరసరఫరాల కార్పొరేషన్ చైర్మన్ పదవిని ప్రభు త్వం అప్పగించింది. ఆయనకు కూడా కేబినెట్ హోదా కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.



# మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం

## పాల్గొన్న సీఎం రేవంత్, మంత్రులు.. హోంశాఖ అప్పగించే అవకాశాలు?

తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. 2025, అక్టోబర్ 31వ తేదీ మధ్యాహ్నం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొన్నారు.

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): అజారుద్దీన్ భారత జాతీయ క్రికెట్ జట్టు కెప్టెన్‌గా తన కెరీర్‌ను ముగించిన తర్వాత రాజకీయాల్లోకి ప్రవేశించారు. 2009లో యూపీ నుంచి ఎంపీగా గెలుపొందారు. 2014 ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం నుంచి మాగంటి గోపీనాథ్‌పై పోటీ తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,082 |
| వెండి (గ్రాము): | రూ.165 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,472 |

## విశ్వవాణి



నీళ్లు లేని ప్రాంతం.. కనుచూపు మేర ఎటుచూసినా ఎడారే.. ప్రయాణానికి ఒంటెలే దిక్కు. అలాంటి ప్రాంతంలో మంచు కురవడం అంటే ఆశ్చర్యమే కదా. అవును! సౌదీ అరేబియన్ ఎడారిలో మంచు కురవడమే ఆశ్చర్యకరం. ఈ హఠాత్పరిణామాన్ని చూసి అక్కడివాళ్లే షాక్ అవుతున్నారట.

# హార్ట్ అటాక్‌కూ గోలీ



## గుండెపోటును నివారించే రైబెల్సస్..అనుమతి ఇచ్చిన ఎఫ్‌డీఏ

### నోటి ద్వారా తీసుకునే తొలి జీఎల్పీ-1 ఔషధం..ఇప్పటికే టైప్-2 డయాబెటిస్‌కు వినియోగం

వైద్య రంగంలో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. గుండెపోటు, స్ట్రోక్ వంటి తీవ్రమైన హృదయ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని తగ్గించేందుకు 'రైబెల్సస్' అనే మందుకు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఆమోదం తెలిపింది. నోటి ద్వారా తీసుకునే (ఓరల్) మొట్టమొదటి జీఎల్పీ-1 రిసెప్టర్ ఆగోనిస్ట్ ఔషధం కావడం దీని ప్రత్యేకత. ఇప్పటికే టైప్-2 డయాబెటిస్ రోగులలో రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి ఈ మందును వాడుతున్నారు. ఇప్పుడు దీని ప్రయోజనాలను హృద్రోగులకు కూడా విస్తరించారు.

న్యూయార్క్: సూది లేకుండా మాత్ర రూపంలో లభించే ఈ చికిత్స, గుండె జబ్బుల నివారణలో ఒక ముందడుగుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు. రైబెల్సస్.. దీనిని ఓరల్ సెమాగ్లూటైడ్ అని కూడా పిలుస్తారు. ఇది మన శరీరంలో సహజంగా ఉండే జీఎల్పీ-1 అనే హార్మోన్‌ను అనుకరించి పనిచేస్తుంది. ఈ హార్మోన్ రక్తంలో చక్కెర స్థాయులను, ఆకలిని అదుపులో ఉంచుతుంది. దీనితో పాటు, గుండెపోటుకు తరువాయి 2 వ పేజీలో...



# ఈ పెయింటింగ్ ధర.. రూ.120 కోట్లు

భారతీయ క్లాసికల్ ఆర్ట్ మార్కెట్‌లో చరిత్ర సృష్టించిన అరుదైన ఘట్టం లండన్‌లో జరిగింది. 16వ శతాబ్దానికి చెందిన మొఘల్ కాలం నాటి సూక్ష్మ చిత్రకళ (మినియేచర్ పెయింటింగ్) ఒకటి ప్రముఖ క్రిస్టీస్ వేలంలో రూ.120 కోట్లు (సుమారు $13.6 మిలియన్లు) పలికింది. అనుకున్నదాని కన్నా సుమారు 14 రెట్లు అధిక ధరకు ఆ చిత్రపటం వేలంలో

తరువాయి 2 వ పేజీలో...

# ఐదుగురికి ఉరిశిక్ష

## చిత్తూరు మేయర్ దంపతుల హత్య కేసులో తీర్పు

### 23 మంది నిందితులలో ఐదుగురిని దోషులుగా తేల్చిన కోర్టు..

### ఉరిశిక్ష పడిన దోషులలో మేయర్ భర్త మేనల్లుడు చింటూ




చిత్తూరు, అక్టోబర్ 31 (ఈవార్తలు): చిత్తూరులో పదేళ్ల క్రితం సంచలనం రేకెత్తించిన మేయర్ దంపతుల హత్య కేసులో కోర్టు తాజాగా తీర్పు వెలువరించింది. ఈ కేసులో ఐదుగురు దోషులకు ఉరిశిక్ష విధిస్తూ చిత్తూరు కోర్టు సంచలన తీర్పు చెప్పింది. వివరాల్లోకి వెళితే.. పదేళ్ల క్రితం చిత్తూరు మేయర్ కఠారి అనురాధ, మోహన్ దారుణ హత్యకు గురయ్యారు. నగర పాలక సంస్థ కార్యాలయంలోనే వారిని దారుణంగా హతమార్చారు. ఈ కేసును దర్యాప్తు చేసిన పోలీసులు 23 మందిని నిందితులుగా చేర్చి చార్జిషీట్ ఫైల్ చేశారు. విచారణ చేపట్టిన న్యాయస్థానం.. పోలీసులు నిందితుడిగా పేర్కొన్న తరువాయి 2 వ పేజీలో...

# ఫిబ్రవరి 25 నుంచి ఇంటర్ పరీక్షలు

### 2వ తేదీ నుంచే ప్రాక్టికల్స్ ప్రారంభం

### మార్చి 18 వరకు కొనసాగనున్న పరీక్షలు



హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): తెలంగాణ ఇంటర్మీడియేట్ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 25వ తేదీ నుంచి ఈ పరీక్షలు ప్రారంభమై మార్చి 18 వరకు కొనసాగుతాయని -2 వ పేజీలో...

# కానిస్టేబుల్‌ను రియాజ్ చంపలేదా?

## ఎన్‌కౌంటర్ కాదు.. కస్టోడియల్ డెత్!.. ఫేక్ నోట్స్ స్కాం దాచేందుకే ఎన్‌కౌంటర్ నాటకం

**ఫ్యాక్ట్ ఫైండిగ్ కమిటీ విచారణలో సంచలన విషయాలు**



హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): నిజామాబాద్ రౌడీ షీటర్ రియాజ్ ఎన్‌కౌంటర్‌పై ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ విచారణలో సంచలన విషయాలు బయటపడ్డాయి. రియాజ్‌ది ఎన్‌కౌంటర్ కాదని.. కస్టోడియల్ డెత్ అని తెలిసింది. ఒక ఫేక్ నోట్స్ కుంభకోణం దాచేందుకే ఎన్‌కౌంటర్ నాటకం ఆడారని అనుమానం వ్యక్తం చేసింది. అంతేకాదు కానిస్టేబుల్ ప్రమోద్‌ను రియాజ్ చంపలేదని తేల్చింది. ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తెలిపిన వివరాల ప్రకారం.. రియాజ్ ఒక ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో రికవరీ ఏజెంట్‌గా పనిచేస్తున్నాడు. తన వృత్తిలో భాగంగా ఒకరోజు ఆసిఫ్ అనే వ్యక్తి స్కూటీ జప్తు చేశాడు. ఆ స్కూటీలో రియాజ్‌కు 3 లక్షల రూపాయలు దొరికాయి. తీరా చూస్తే అవి ఫేక్ నోట్లు అని రియాజ్ తెలుసుకున్నాడు. ఫేక్ నోట్లను పలువురికి ఇచ్చి నగదు బదిలీ చేయించుకుని, ఆ డబ్బును ఖర్చు చేశాడు. ఒకరోజు ఆసిఫ్ వచ్చి తన బండి, 3 లక్షలు ఇవ్వాలని, లేకపోతే తన కుటుంబం మొత్తాన్ని చంపేస్తానని బెదిరించాడు. రియాజ్‌కు ఏం చేయాలో తెలియక.. ప్రమోద్ అనే ఒక కానిస్టేబుల్‌ను సంప్రదించి కాపాడమని వేడుకున్నాడు. ప్రమోద్, రియాజ్‌ను ఒక ఉన్నతాధికారి వద్దకు తీసుకెళ్లగా, అతను రూ.1 లక్ష లంచం డిమాండ్ చేశాడు. తాను అంత డబ్బు ఇవ్వలేనని రియాజ్ చెప్పడంతో.. అతన్ని ఎరగా వేసి ఫేక్ నోట్ల స్కామ్ బయటపెట్టాలని పోలీసులు నిర్ణయించుకున్నారు. ఇదంతా గ్రహించి ఆసిఫ్ పారిపోయాడు. రియాజ్ ఇన్‌ఫార్మర్‌గా మారాడని అనుమానంతో, అతన్ని చంపేందుకు ఆసిఫ్ గ్యాంగ్ నిర్ణయించుకుంది. దీంతో రూ.1 లక్ష లంచం ఇస్తే ఆసిఫ్ గ్యాంగ్ నుంచి కాపాడతామని రియాజ్‌కు పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారం ప్రకారం.. అక్టోబర్ 17వ తేదీన రియాజ్, ప్రమోద్ పోలీసులు తెలిపిన స్థలంలో కాకుండా రహస్యంగా కలుసుకుని, లంచం గురించి చర్చించుకున్నారు. రియాజ్, కానిస్టేబుల్ ప్రమోద్ రహస్యంగా కలుసుకున్న విషయం తెలిసి, రియాజ్‌ను చంపేందుకు ఆసిఫ్ గ్యాంగ్ వచ్చింది. ఆ గ్యాంగ్ దాడిలో రియాజ్ తప్పించుకున్నాడు. కానీ కానిస్టేబుల్ మృతి చెందాడు. చిన్న గాయంతో ఉన్న ఆసిఫ్‌ను హైదరాబాద్ ఆసుపత్రికి ఎందుకు తరలించారు అనేది సందేహాలకు తావిస్తుంది. ఎలాంటి విచారణ లేకుండా కానిస్టేబుల్ ప్రమోద్‌ను రియాజ్ చంపాడని పోలీసులు నిర్ధారించారని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. ప్రమోద్ మృతదేహం వీడియోలు, ఫోటోలు కూడా పోలీసులు తీయలేదని పేర్కొన్నారు. రియాజ్ కోసం వెతికే క్రమంలో అతని భార్య, తల్లి, ఇద్దరు మైనర్ పిల్లలను రెండు రోజులు అక్రమంగా స్టేషన్‌లో నిర్బంధించారని చెప్పారు. అతని భార్య, తల్లిపై పోలీసులు లైంగిక దాడులు చేశారని అన్నారు. ప్రైవేట్ భాగాల్లో కారంపొడి చల్లారన్నారు. రియాజ్ మైనర్ పిల్లలను తలకిందులుగా వేలాడదీసి, వారి దుస్తుల్లోకి బల్లులు, కప్పలను వదిలి చిత్రహింసలు పెట్టారని పేర్కొన్నారు. రియాజ్ పట్టుబడ్డాక కోర్టులో హాజరు పరచకుండా నేరుగా అరెస్టు చేసి అతన్ని చిత్రహింసలు పెట్టారని ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ సభ్యులు తెలిపారు. థర్డ్ డిగ్రీ చేయడంతో రియాజ్ కస్టడీలోనే చనిపోయాడని అన్నారు. చనిపోయిన రియాజ్ మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి, తప్పించుకోబోతే ఎన్‌కౌంటర్ చేశామని పోలీసులు అబద్ధాలు చెబుతున్నారని తెలిపారు. రియాజ్ స్కూటీ, హత్య చేసిన ఆయుధం లాంటి ఆధారాలు ఏవీ పోలీసులు ప్రవేశపెట్టలేదని పేర్కొన్నారు. కాల్ రికార్డింగ్స్, సీసీటీవీ ఫుటేజ్ లాంటివన్నీ పోలీసుల అదుపులోనే ఉన్నాయని అన్నారు. ఈ ఎన్‌కౌంటర్ కచ్చితంగా ఒక కస్టోడియల్ డెత్ కవర్ చేసే బూటకం మాత్రమే అని స్పష్టం చేశారు. ఒక ఫేక్ నోట్స్ కుంభకోణం దాచిపెట్టేందుకే ఈ ఎన్‌కౌంటర్ నాటకం ఆడినట్లు మాకు అనుమానాలు ఉన్నాయని తెలిపారు. దీనిపై సీబీఐ ఎంక్వయిరీ జరిపించాలని హైకోర్టు న్యాయమూర్తిని అడుగుతామన్నారు.



## శ్రీశైలంలో పాతాళగంగ వద్ద కృష్ణమ్మకు హారతి

శ్రీశైలం, అక్టోబర్ 31 (ఈవార్తలు): శ్రీశైలం ఆలయంలో కార్తీక మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా కార్తీక రెండవ శుక్రవారమైన సాయంత్రం పాతాళగంగ వద్ద కృష్ణమ్మ హారతి కార్యక్రమం కన్నుల పండువగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో పాతాళగంగ వద్ద నెల్పకొల్పబడిన కృష్ణవేణి నదీమ తల్లి విగ్రహానికి పూజాదికాలు, వస్త్ర సమర్పణ తదితర కార్యక్రమాలు జరిపించారు. అదే విధంగా పాతాళగంగ ఘాట్ వద్ద నీటిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకు విశేషపూజాదికాలు, దశహారతులు సమర్పించారు. అదేవిధంగా నదీమతల్లికి పూజాదికాలు, సారె సమర్పణ, దశహారతులను అర్పించారు. ఈ హారతి కార్యక్రమానికి ముందు లోకకల్యాణాన్నికాంక్షిస్తూ అర్చక స్వాములు సంకల్పాన్ని పఠించారు. మహా గణపతి పూజ కూడా నిర్వహించారు. సంప్రదాయాన్ని అనుసరించి నదీమతల్లికి ఏకహారతి, నేత్రహారతి, బిల్వహారతి, నాగహారతి, పంచహారతి, సద్యోజాతాది పంచహారతులు, కుంభహారతి, నక్షత్రహారతి, రథహారతి, కర్పూర హారతులు ఇచ్చారు.

## రేవంత్‌తో సల్మాన్ ఖాన్ భేటీ



ముంబై: బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమయ్యారు. గురువారం సాయంత్రం ముంబైలో వీరి భేటీ జరిగింది. ఈ సందర్భంగా తెలంగాణ అభివృద్ధి సందేశాన్ని ప్రపంచవ్యాప్తంగా ప్రచారం చేస్తానని సల్మాన్ ఖాన్ హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ సమావేశంలో వీరిద్దరి మధ్య జరిగిన చర్చల పూర్తి వివరాలు బయటకు రానప్పటికీ, తెలంగాణ ప్రతిష్ఠను ప్రపంచ స్థాయిలో ఇనుమడింపజేసే అంశాలపై చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో సల్మాన్ ఖాన్ మాట్లాడుతూ.. తెలంగాణ రైజింగ్ అనే సందేశాన్ని ప్రపంచ నలుమూలలకూ తీసుకెళ్తానని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలకు, తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచడానికి తన వంతు సహకారం అందిస్తానని ఆయన చెప్పినట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో సినీ ప్రముఖులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం కావడం ఇది రెండోసారి. గత జులై నెలలో ప్రముఖ నటుడు దుల్కర్ సల్మాన్ కూడా ముఖ్యమంత్రిని కలిసి, రాష్ట్ర ప్రభుత్వ జ్యూరీ అవార్డు ప్రకటించినందుకు వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పుడు సల్మాన్ ఖాన్ భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. సినీ పరిశ్రమకు చెందిన ప్రముఖుల ద్వారా తెలంగాణకు పెట్టుబడులు ఆకర్షించడం, రాష్ట్ర ప్రతిష్ఠను పెంచడంలో భాగంగానే ఈ సమావేశాలు జరుగుతున్నాయని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

## మాగంటి సునీతపై కేసు

**పార్టీ గుర్తుతో ఓటర్ స్లిప్పులు పంచుతున్నారని ఆరోపణ**

**రిటర్నింగ్ అధికారికి కాంగ్రెస్ నేత మోహన్ రెడ్డి ఫిర్యాదు**

**ఆర్వో ఆదేశాలతో కేసు నమోదు చేసిన బోరబండ పోలీసులు**

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై కేసు నమోదైంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారన్న ఆరోపణలపై బోరబండ పోలీసులు ఆమెపై కేసు నమోదు చేశారు. పార్టీ గుర్తుతో కూడిన ఓటర్ స్లిప్పులను పంపిణీ చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేయడంతో ఈ పరిణామం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ కారు గుర్తుతో ఉన్న ఓటర్ స్లిప్పులను ప్రజలకు పంచుతున్నారని కాంగ్రెస్ మీడియా, కమ్యూనికేషన్ ఛైర్మన్ మోహన్ రెడ్డి ఆరోపించారు. ఇది ఎన్నికల నిబంధనలను స్పష్టంగా ఉల్లంఘించడమేనని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన నేరుగా రిటర్నింగ్ అధికారికి (ఆర్వో) లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నేత మోహన్ రెడ్డి చేసిన ఫిర్యాదును స్వీకరించిన రిటర్నింగ్ అధికారి, దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. ఆర్వో ఆదేశాల మేరకు రంగంలోకి దిగిన బోరబండ పోలీసులు, మాగంటి సునీతపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటన జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.



## మావోయిస్టులను నిర్మూలించడం అసాధ్యం

**మావోయిస్టు పార్టీలో నమ్మకద్రోహులు ఉన్నారు**

**బసవరాజు ఎన్‌కౌంటర్‌పై కోవర్ట్ ఆపరేషన్ అనుమానం**

**అనారోగ్య కారణాలతోనే అజ్ఞాతం వీడినట్లు వెల్లడి**

**మాజీ మావోయిస్టు చంద్రన్న సంచలన వ్యాఖ్యలు**

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): మావోయిస్టు పార్టీలో కొందరు నమ్మకద్రోహులు ఉన్నారని, బసవరాజు ఎన్‌కౌంటర్ వెనుక కోవర్ట్ ఆపరేషన్ జరిగిందని మాజీ మావోయిస్టు, కేంద్ర కమిటీ సభ్యుడు పల్లూరి ప్రసాద్‌రావు అలియాస్ చంద్రన్న సంచలన వ్యాఖ్యలు చేశారు. 45 ఏళ్లుగా అజ్ఞాతంలో కొనసాగిన ఆయన, ఇటీవల తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట లొంగిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'తో మావోయిస్టు పార్టీకి నష్టం వాటిల్లినప్పటికీ, పార్టీని పూర్తిగా నిర్మూలించడం సాధ్యం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. మావోయిస్టులను లేకుండా చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటన ఆచరణ సాధ్యం కాదని పేర్కొన్నారు. తాను ఆయుధాలు తీసుకుని మూకుమ్మడిగా లొంగిపోవడాన్ని సమర్థించనని, కేవలం తన అనారోగ్య కారణాలతోనే అజ్ఞాతం వీడానని చంద్రన్న స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలం వడుకాపూర్‌కు చెందిన చంద్రన్న, 1979లో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ)తో తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1980లో కిషన్‌జీ అనుచరుడిగా దండకారణ్యంలోకి ప్రవేశించి, 1981లో పీపుల్స్‌వార్‌లో చేరారు. అంచెలంచెలుగా ఎదుగుతూ 2024 నాటికి కేంద్ర కమిటీ సభ్యుడిగా తెలంగాణ రాష్ట్ర కమిటీకి మార్గదర్శకత్వం వహించారు. అయితే, దీర్ఘకాలిక మోకాళ్ల వ్యాధితో ఆరోగ్యం క్షీణించడం, భద్రతా దళాల నిరంతర ఒత్తిడి, పార్టీ నాయకత్వంతో ఏర్పడిన సిద్ధాంతపరమైన భేదాభిప్రాయాల కారణంగా ఆయన లొంగిపోయినట్లు డీజీపీ శివధర్ రెడ్డి ఇటీవల వెల్లడించారు. సుదీర్ఘకాలం పార్టీలో కీలక పాత్ర పోషించిన చంద్రన్న చేసిన ఆరోపణలు తాజాగా కలకలం రేపుతున్నాయి.

### ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా

**సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు**

## ప్రజా విజయోత్సవాలు



హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): తెలంగాణ రైజింగ్ తో పాటు తెలంగాణ ఆవిర్భావం, అభివృద్ధి అంశాలు కలగలిపి ఒక సమగ్ర ప్రణాళికతో ప్రపంచ దృష్టిని ఆకర్షించేలా ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శుక్రవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రజా పాలన విజయోత్సవాల నిర్వహణపై ప్రభుత్వ సలహాదారు కే కేశవరావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఆవిర్భావం ఎలా సాధించాం, కొత్త రాష్ట్రంలో ఎన్ని విజయాలు నమోదు చేశాం, భవిష్యత్తు లో తెలంగాణ రాష్ట్రం ఏం సాధించబోతుంది అనే విషయాలను ప్రపంచానికి వివరించే విధంగా కార్యక్రమాలు ఉండాలని అధికారులకు డిప్యూటీ సీఎం సూచించారు. పెట్టుబడిదారులను ఈ విజయోత్సవానికి ఆహ్వానిస్తున్నాం, పెద్ద ఎత్తున %ఎశీబ% లు జరిగేలా వాతావరణం ఉండాలి అన్నారు. దుబాయ్ ఫెస్టివల్ పూర్తిగా దుబాయ్ పట్టణానికి దూరంగా జరుగుతుంది అదే పద్ధతిలో మన రాష్ట్రంలోనూ ఫ్యూచర్ సిటీలో కొన్ని ప్రదర్శనలు ఏర్పాటు చేసేందుకు అధికారులు ఆలోచన చేయాలని డిప్యూటీ సీఎం అన్నారు. సీనియర్ మరియు జూనియర్ అధికారులతో కలిపి కమిటీలు వేయాలని ప్రణాళికా ప్రకారం పనులు విభజించుకుని నాణ్యతతో సకాలంలో అనుకున్న ప్రణాళికను అమలు చేసేలా ముందుకు వెళ్లాలని డిప్యూటీ సీఎం అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ రాష్ట్రం, మూసి పునర్జీవనం, ఫ్యూచర్ సిటీ, ఇప్పటికే అనేక పరిశ్రమలను తెలంగాణ ఆకర్షిస్తుంది, భవిష్యత్తు తెలంగాణ ఎలా ఉండబోతుందో ఈ వేడుకల్లో ప్రపంచానికి చూపించే విధంగా ఏర్పాటు చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు.

## బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లే

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని మంత్రి వివేక్ ఆరోపించారు. శుక్రవారం టోలిచౌకిలోని జానకినగర్ మైనార్టీ నేతలతో ఆయన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వివేక్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ఇక్కడ ఇన్ని కోట్లు, అక్కడ అన్ని కోట్లు అని చెప్తే నిజమని అనుకున్నానని.. కానీ, కేవలం ప్రకటనలు మాత్రమే చేశారని.. పనులు ఎక్కడా చేయలేదని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎక్కడా రోడ్లు, నాలాలు, డ్రైనేజీలు నిర్మాణం చేయలేదని అన్నారు మంత్రి వివేక్. తాను ఇంచార్జి అయ్యాక జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో రూ. 200 కోట్లతో పనులు చేశామని.. షేక్ పేట్ డివిజన్ లో రూ. 100 కోట్ల పనులు చేశామని అన్నారు మంత్రి వివేక్.

## 30 కోట్ల ప్రభుత్వ స్థలం సేఫ్

**కాపాడిన హైడ్రా.. కబ్జా నుంచి 4 వేల గజాల పార్కు సేఫ్**

పోచారం, అక్టోబర్ 31 (ఈవార్తలు): హైదరాబాద్ లోని పోచారంలో రూ. 30 కోట్ల విలువైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడింది హైడ్రా. శుక్రవారం స్థానికుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆక్రమణల కూల్చివేతలు చేపట్టారు. ఇందుకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. పోచారం మున్సిపాలిటీ పరిధిలోని డాక్టర్స్ కాలనీలో 4 వేల గజాల పార్కు స్థలం కబ్జాకు గురైనట్లు హైడ్రకు ఫిర్యాదు చేశారు స్థానికులు. పార్కు స్థలంలో లేఔట్ వేసినవారే కబ్జాకు పాల్పడినట్లు గుర్తించింది హైడ్రా. స్థానికుల ఫిర్యాదుతో క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి పార్కు స్థలం కబ్జాకు గురైనట్లు నిర్ధారించింది. తప్పుడు డాక్యుమెంట్స్ తో ఆముదాల రమేష్ అనే వ్యక్తి 4 వేల గజాలను 800 గజాల చొప్పున 5 ప్లాట్లుగా కులకర్ణి అనే వ్యక్తికి అమ్మినట్లు గుర్తించింది హైడ్రా.



## జూబ్లీహిల్స్‌లో గెలిచేది కాంగ్రెస్సే

**బీఆర్ఎస్‌ను నమ్మే పరిస్థితి లేదు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి**

జూబ్లీహిల్స్/హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం సాయంత్రం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. వెంగళరావు నగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ తరపున ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఎవరైనా మరణిస్తే వారి స్థానంలో పోటీ పెట్టకూడదనే సంప్రదాయాన్ని బీఆర్ఎస్ పార్టీ తుంగలో తొక్కిందని ఆరోపించారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీని ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరని ఆయన అన్నారు. గతంలో పీజేఆర్ మరణించినప్పుడు బీఆర్ఎస్ దుర్మార్గంగా వారి అభ్యర్థిని నిలబెట్టిందని మండిపడ్డారు. నగరానికి గోదావరి నీళ్లు తెచ్చిన ఘనత పీజేఆర్‌దేనని కొనియాడారు. అలాంటి పీజేఆర్‌పై పోటీకి దింపిన బీఆర్ఎస్‌కు సానుభూతి ఓట్లు అడిగే హక్కు లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కంటోన్మెంట్‌లో కూడా సెంటిమెంట్‌ను నమ్ముకున్నారని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధమని ఎద్దేవా చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆరోపించారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అవయవదానం చేసి బీజేపీని గెలిపించిందని వ్యాఖ్యానించారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఎప్పుడైనా ఈ ప్రాంతానికి వచ్చారా అని నిలదీశారు. ఓట్ల కోసం బీఆర్ఎస్ నాయకులు వస్తే వారికి వాతలు పెట్టాలని ఓటర్లకు సూచించారు. నవీన్‌ను గెలిపిస్తే అభివృద్ధి అంటే ఏమిటో చూపిస్తామని హామీ ఇచ్చారు.

## 1,031 కోట్ల బకాయిలు విడుదల

**ఉద్యోగులకు సర్కారు ఊరట**

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వం మరో గుడ్ న్యూస్ చెప్పింది. ఉద్యోగుల బకాయిలతోపాటు పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించిన అక్టోబర్ నెల పెండింగ్ బిల్లులు సుమారు రూ.1,031 కోట్లను విడుదల చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు ఏకకాలంలో నిధులను విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శుక్రవారం ఆర్థిక శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందుకు సంబంధించి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల బకాయిలను కాంగ్రెస్ సర్కార్ దశలవారీగా క్లియర్ చేస్తూ వస్తోంది. అందులో భాగంగా అక్టోబర్ నెలకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.712 కోట్లను రిలీజ్ చేశారు. రూ.10లక్షల లోపు పెండింగ్ బిల్లులను సైతం క్లియర్ చేయాలన్న సర్కార్ నిర్ణయంలో భాగంగా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించి 46,956 బిల్లుల తాలూకు రూ.320 కోట్లను డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు అధికారులు రిలీజ్ చేశారు. రోడ్లు, భవనాల శాఖకు చెందిన రూ.10లక్షల లోపు విలువగల 3,610 బిల్లుల మొత్తం సుమారు రూ.95కోట్లను ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. అదేవిధంగా పంచాయతీరాజ్, గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన 43,364 బిల్లుల మొత్తం రూ.225 కోట్లనూ అధికారులు రిలీజ్ చేశారు.

## 'భూదాన్'లో ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఊరట

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): భూదాన్ భూముల వ్యవహారంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. అక్టోబర్ 17న సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ సవరించింది. నాగారం సర్వే నెంబర్ 194, 195లో ఐఏఎస్, ఐపీఎస్‌లు కొనుగోలు చేసిన భూములను నిషేధిత జాబితాలో ఉంచాలంటూ సింగిల్ బెంచ్ గతంలో తీర్పు వెలువరించింది. దీనిని సవాల్ చేస్తూ పలువురు ఐపీఎస్‌లను డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఆధారాలను పరిశీలించిన డివిజన్ బెంచ్.. అవి భూదాన్ భూములు కానప్పుడు నిషేధిత జాబితాలో ఎందుకు ఉంచాలని వ్యాఖ్యానించింది. సర్వే నెంబర్ 194, 195లోని భూములు పట్టా భూములేనని కలెక్టర్ కూడా నివేదిక ఇచ్చారు. సర్వే నెంబర్ 181, 182లలో ఉన్న భూములపై మాత్రం యథాతథ స్థితి కొనసాగుతుందని డివిజన్ బెంచ్ పేర్కొంది. హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. వచ్చే నెల 27న వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. బతుకమ్మ కుంట ప్రైవేట్ స్థలంలో యథాతథ స్థితిని కొనసాగించాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలను పట్టించుకోలేదని సుధాకర్ అనే వ్యక్తి ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం కోర్టు ధిక్కరణ కింద ఎందుకు చర్యలు తీసుకోకూడదో చెప్పాలని రంగనాథ్‌ను ప్రశ్నించింది.

## రవాణా శాఖ కమిషనర్‌గా ఇలాంబర్తి

**రాష్ట్రంలో 8 మంది ఐఏఎస్‌ల బదిలీ**

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): తెలంగాణలో మరోసారి ఐఏఎస్ అధికారుల బదిలీ జరిగింది. 8 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల స్పెషల్ ప్రిన్సిపల్ సెక్రటరీగా సభ్యసాచి ఘోష్, గురుకుల సంక్షేమ కమిషనర్‌గా అనితా రామచంద్రన్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ కమిషనర్‌గా ఇలాంబర్తిని నియమించిన ప్రభుత్వం పశుసంవర్ధకశాఖ కార్యదర్శిగా ఆయనకు అదనపు బాధ్యతలు అప్పగించింది. జీఏడీ పొలిటికల్ ఇంచార్జి సెక్రటరీగా ఈ.శ్రీధర్, ఆయిల్ ఫెడ్ ఎండీగా యాస్మిన్ బాషా నియమితులయ్యారు. ఎస్సీ అభివృద్ధి కమిషనర్‌గా జి. జితేందర్ రెడ్డి నియామకం కాగా ఆయనకు ఎస్సీ సహకార సంస్థ ఎండీగా అదనపు బాధ్యతలు కల్పించారు. మెట్రో పాలిటన్ అర్బన్ డెవలప్మెంట్ కార్యదర్శి బాధ్యతలను సీఎస్ రామకృష్ణ రావు తన వద్దే ఉంచుకున్నారు.

## జగిత్యాలలో బాలిక అనుమానాస్పద మృతి

జగిత్యాల టౌన్, అక్టోబర్ 31 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలో నికొండాపూర్ కి చెందిన బాలిక సహస్ర శుక్రవారం(అక్టోబర్31) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అయితే బాలిక మృతి సహజం లేదని పలు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు గ్రామస్తులు, బంధువులు. బాలిక అమ్మమ్మ తన మనవరాలి మృతిపట్ల అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కొండాపూర్ కు చెందిన రవి, జ్యోతిలకు 16ఏళ్ల క్రితం పెళ్లైంది. వారికి కొడుకు, కూతురు సహస్ర(మృతురాలు) ఉన్నారు. 2017లో జ్యోతి ఉరివేసుకొని చనిపోవడంతో రవి రెండో పెళ్లి చేసుకున్నాడు. అప్పటినుంచి మృతురాలిని సవతి తల్లి మానసిక వేధింపులకు గురిచేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. తల్లి చనిపోయినప్పటి నుంచి సహస్రను తన అమ్మమ్మ, ఇతర బంధువులను కలవకుండా వేధించారని బంధువులు చెబుతున్నారు. తండ్రి రవి, సవతి తల్లి కిలసి సహస్రను హత్య చేసి ఉరివేసుకొని చనిపోయిందని డ్రామా అడుతున్నారని మృతురాలి అమ్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సహస్ర ను మృతి విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం జగిత్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

# ఏపీలో ఎన్టీఆర్ వైద్య సేవలు మళ్లీ ప్రారంభం

**ప్రైవేటు ఆసుపత్రుల్లో కొనసాగనున్న సేవలు.. ప్రభుత్వంతో జరిగిన చర్చలు విజయవంతం**

**బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చిన సర్కార్**



విజయవాడ, అక్టోబర్ 31 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రోగులకు ఊరటనిచ్చే వార్త. కొద్దిరోజులుగా ప్రైవేటు నెట్ వర్క్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో నిలిచిపోయిన ఎన్టీఆర్ వైద్య సేవలు తిరిగి ప్రారంభమయ్యాయి. పెండింగ్ బకాయిల విడుదల విషయమై ప్రభుత్వానికి, ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలకు మధ్య నెలకొన్న వివాదం పరిష్కారమైంది. ప్రభుత్వంతో జరిగిన చర్చలు సఫలం కావడంతో సేవలను కొనసాగించేందుకు యాజమాన్యాలు అంగీకరించాయి. గత కొంతకాలంగా తమకు రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రైవేటు నెట్ వర్క్ స్పెషాలిటీ ఆసుపత్రులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రాకపోవడంతో ఎన్టీఆర్ వైద్య సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా పేద, మధ్యతరగతి రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సకాలంలో వైద్యం అందక అనేకమంది అవస్థలు పడ్డారు. ఈ నేపథ్యంలో రంగంలోకి దిగిన ప్రభుత్వం, ఆసుపత్రుల యాజమాన్యాలతో చర్చలు జరిపింది. యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను, డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చింది. ప్రభుత్వ హామీతో సంతృప్తి చెందిన ప్రైవేటు ఆసుపత్రులు, ఎన్టీఆర్ వైద్య సేవలను పునరుద్ధరించడానికి అంగీకరించాయి. దీంతో రోగులు యథావిధిగా ఈ సేవలను వినియోగించుకునేందుకు మార్గం సుగమమైంది.

# యాంకర్ శ్యామలపై పోలీసు కేసు



కర్నూలు, అక్టోబర్ 31 (ఈవార్తలు): కర్నూలు జిల్లాలో 19 మంది ప్రాణాలను బలిగొన్న వేమూరి కావేరి బస్సు దగ్ధం ఘటన రాజకీయ రంగు పులుముకుంది. ఈ ప్రమాదంపై సోషల్ మీడియాలో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారన్న ఆరోపణలతో పోలీసులు 27 మందిపై కేసు నమోదు చేశారు. వైసీపీ అధికారిక ఎక్స్ ఖాతా నిర్వాహకులతో పాటు, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యాంకర్ శ్యామల, సీవీ రెడ్డి, కందుకూరి గోపికృష్ణ వంటి వారి పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ప్రభుత్వ ఆధ్వర్యంలోని బెల్టు షాపులు, కల్తీ మద్యం వల్లే ఈ ఘోర ప్రమాదం జరిగిందంటూ వైసీపీ ప్రచారం చేయడమే ఇందుకు కారణమైంది. ఈ ప్రచారంపై కర్నూలు మండలం బి. తాండ్రపాడుకు చెందిన పేరపోగు వెనుములయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు ఆధారంగా కర్నూలు తాలుకా అర్బన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మల్యాల పోలీస్ శాఖ నిర్వహించిన టుకే రన్ ప్రోగ్రాం అంగడి బజార్ నుండి బ్లాక్ చౌరస్తా వరకు జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



# 10 నెలల్లో 124 మందికి జైలు శిక్ష

**నేరం చేస్తే శిక్ష తప్పదు: జగిత్యాల ఎస్పీ**

**పీపీలకు అభినందన.. ప్రశంసాపత్రాలు అందజేత**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 31 (ఈవార్తలు): కోర్టు కేసుల్లో నేరస్తులకు శిక్ష పడేలా చేయడం, శిక్షల శాతాన్ని పెంచడం ద్వారా సమాజంలో మంచి మార్పు తీసుకురావచ్చని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కోర్టు కేసులకు సంబంధించిన కేసుల్లో నిందితులకు శిక్షల పడేలా కృషి చేసిన పీపీలను అభినదించి శాలువలతో సన్మానించి, ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. నిందితులకు శిక్షపడటంలో పోలీసులతో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్ల కీలకపాత్ర పోషించారని, పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సమన్వయంతో నేరస్థులకు శిక్ష పడేవిధంగా కృషి చేయాలని సూచించారు. ప్రధాన కేసుల్లో నిందితులకు జీవిత ఖైదు పడేలా కృషి చేసి శిక్షల శాతం పెరిగేలా పని చేయటం అభినందనీయమని అన్నారు. పోక్సో, హత్య కేసులను ప్రధానమైనవిగా భావించి ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుత రోజుల్లో సాంకేతికత కీలకంగా మారిందని అన్ని కేసుల్లో సైంటిఫిక్ ఆధారాలు కచ్చితంగా జమ చేయాలన్నారు. గడిచిన పది నెలల్లో 103 కేసుల్లో నిందితులుగా ఉన్న 124 మందికి జైలు శిక్షలు వేయించగలిగామని, ఇందులో 21 మంది ని%శీ%దితులకు జీవిత జీవిత ఖైదు, ఆరుగరికి 20 సంవత్సరాల జైలు శిక్ష, మరో ఆరుగురు నిదితులకు 10 సంవత్సరాల జైలు శిక్షలు విధించినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ వెంకటరమణ, సైబర్ క్రైమ్ డీఎస్పీ వెంకటరమణ, రఘు చందర్, రాములు, రంగారెడ్డి, పీపీలు పాల్గొన్నారు.

# పెనుగొండ ఇక వాసవీ పెనుగొండ

**పేరు మార్చుతూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం**

**ఆర్యవైశ్యుల విజ్ఞప్తి మేరకు పేరు మార్పు**

పెనుగొండ, అక్టోబర్ 31 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెనుగొండ పేరును 'వాసవీ పెనుగొండ'గా మార్చాలని నిశ్చయించింది. ఆర్యవైశ్యుల చిరకాల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ఉత్తర్వులు (జీవో) జారీ కానున్నాయి. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర మంత్రి సవితతో ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ రాకేష్ నేతృత్వంలోని ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు సమావేశమయ్యారు. పెనుగొండకు ఉన్న చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను వివరిస్తూ, దాని పేరును వాసవీ పెనుగొండగా మార్చాలని వారు మంత్రికి విజ్ఞప్తి చేశారు. ఆర్యవైశ్యుల వినతిని సానుకూలంగా పరిశీలించిన మంత్రి సవిత, ఈ మేరకు అక్కడే అధికారికంగా ప్రకటన చేశారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారు జన్మించిన పెనుగొండ గ్రామానికి ఎంతో చారిత్రక ప్రాధాన్యత ఉందని, ఆర్యవైశ్యుల మనోభావాలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె వివరించారు. పేరు మార్పునకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు త్వరలోనే విడుదల కానున్నాయని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఆర్యవైశ్యుల సంక్షేమానికి, అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా మంత్రి సవిత పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై ఆర్యవైశ్య సంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు.

# 'మొంథా' నష్టంపై ఏపీ ప్రాథమిక నివేదిక

అమరావతి, అక్టోబర్ 31 (ఈవార్తలు): ఏపీలో 'మొంథా' తుపాను బీభత్సంతో వాటిల్లిన నష్టంపై కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక నివేదిక అందించింది. మొత్తం రూ.5,244 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు వెల్లడించింది. తుపాను ప్రభావిత ప్రాంతాల పరిశీలనకు కేంద్ర బృందాలను పంపాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి తక్షణ సాయం చేయాలని కోరారు. 249 మండలాల పరిధిలో 1,434 గ్రామాలు, 48 పట్టణాలపై తుపాను ప్రభావం పడినట్లు ప్రాథమిక నివేదికలో పేర్కొన్నారు.

# కోటి ఉద్యోగాలిస్తాం

**లక్షాధికారులుగా దీదీలు.. బీహార్‌లో ఎన్డీయే మేనిఫెస్టో హైలైట్స్**



పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికలు-2025 సమీపిస్తున్న వేళ, అధికార జాతీయ ప్రజాస్వామ్య కూటమి (ఎన్డీయే) తమ ఎన్నికల మేనిఫెస్టో 'సంకల్ప్ పత్ర'ను తాజాగా విడుదల చేసింది. భారీ ఎత్తున ఉద్యోగాల కల్పన, మహిళా సాధికారత, రైతులు, పేదలకు సంక్షేమ పథకాలను ప్రధాన హామీలుగా ప్రకటించింది. పాట్నాలో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, కేంద్ర మంత్రులు జితన్ రామ్ మాంఝీ (హెచ్ఏఎం-ఎస్), చిరాగ్ పాశ్వాన్ (ఎల్‌జేపీ-రామ్ విలాస్), ఆర్ఎల్ఎం నేత ఉపేంద్ర కుష్వాహా సహా ఇతర కూటమి నాయకులు హాజరయ్యారు. బీహార్‌లో కోటి ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్డీయే హామీ ఇచ్చింది. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఈ ఉద్యోగాలను సృష్టిస్తామని, దీనికి అనుగుణంగా యువతకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు చేపడతామని తెలిపింది. ప్రతి జిల్లాలో ఒక మెగా స్కిల్ సెంటర్ ఏర్పాటు చేసి, రాష్ట్రవ్యాప్తంగా స్కిల్ సెన్సస్ ద్వారా యువత ప్రతిభను గుర్తించి శిక్షణ ఇస్తామని పేర్కొంది. బీహార్‌ను 'గ్లోబల్ స్కిల్లింగ్ హబ్'గా మార్చడమే లక్ష్యమని మేనిఫెస్టోలో వివరించింది. 'ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన' కింద వ్యాపారాలు ప్రారంభించే మహిళలకు రూ.2 లక్షల వరకు ఆర్థిక సాయం అందిస్తామని ఎన్డీయే ప్రకటించింది. కోటి మంది మహిళలను లక్షాధికారులుగా (లక్షాధికారి దీదీ)గా (ఏడాదికి లక్ష రూపాయలకు పైగా సంపాదించే మహిళలు) తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని తెలిపింది. విజయవంతమైన మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడానికి 'మిషన్ కరోడ్‌పతి'ని కూడా ప్రవేశపెట్టనున్నట్లు హామీ ఇచ్చింది. రైతుల కోసం 'కర్పూరీ ఠాకూర్ కిసాన్ సమ్మాన్ నిధి' పథకాన్ని ప్రకటించింది. దీని కింద ప్రతి రైతుకు పంట సీజన్‌కు రూ.3,000 చొప్పున ఏటా రూ.9,000 అందిస్తామని హామీ ఇచ్చింది. ప్రతి పంచాయతీలో వరి, గోధుమలు, పప్పుధాన్యాలు, మొక్కజొన్న సేకరణ కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని తెలిపింది. అత్యంత వెనుకబడిన వర్గాల (ఈబీసీ) ఆర్థిక, సామాజిక సాధికారత తమ ప్రభుత్వ ప్రాధాన్యమని డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి తెలిపారు. "ఈబీసీ వర్గాలకు చెందిన కుటుంబాలకు రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందిస్తాం. వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులను అంచనా వేసి, వారి అభివృద్ధికి అవసరమైన సిఫార్సులు చేసేందుకు సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి అధ్యక్షతన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తాం" అని ఆయన వివరించారు.

# నేతాజీ విమాన ప్రమాదంలో చనిపోలేదు

**నా వద్ద ఎలాంటి ఆధారాలైతే లేవు**

**స్వాతంత్ర్య యోధుడు దేవర్ మాటలనే నమ్ముతున్నా**

**ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్**



చెన్నై: నేతాజీ సుభాష్ చంద్రబోస్ మరణంపై భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అందరూ భావిస్తున్నట్లుగా నేతాజీ విమాన ప్రమాదంలో మరణించలేదని తాను గట్టిగా విశ్వసిస్తున్నట్లు తెలిపారు. అయితే, తన నమ్మకాన్ని బలపరిచేందుకు తన వద్ద ఎలాంటి ఆధారాలు లేవని ఆయన స్పష్టం చేయడం గమనార్హం. తమిళనాడు పర్యటనలో ఉన్న ఉపరాష్ట్రపతి గురువారం మీడియాతో మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుడు, నేతాజీకి అత్యంత నమ్మకమైన అనుచరుడైన పసుపొన్ ముత్తురామలింగ దేవర్ చెప్పిన మాటల వల్లే తాను ఈ విషయాన్ని నమ్ముతున్నట్లు వివరించారు. "నేతాజీ ఆ విమాన ప్రమాదంలో మరణించలేదు, నేను ఆయన్ను కలిశాను' అని దేవర్ నాతో చెప్పారు. అందుకే నేను నమ్ముతున్నాను" అని రాధాకృష్ణన్ పేర్కొన్నారు. దేవర్ తన జీవితంలో ఎప్పుడూ అబద్ధం చెప్పలేదని, ఆయన తన రాజకీయ ప్రస్థానంలోనూ ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించారని ఉపరాష్ట్రపతి కొనియాడారు. బుధవారం రాధాకృష్ణన్ రామనాథపురంలో దేవర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. ఈ పర్యటనలో రాష్ట్ర బీజేపీ సీనియర్ నేతలు కూడా ఆయన వెంట ఉన్నారు. ఈ సందర్భంగా దేవర్ త్యాగాలను ఉపరాష్ట్రపతి గుర్తుచేసుకున్నారు. హెచ్చుతగ్గులు లేని సమాజం కోసం దేవర్ తన జీవితాన్ని అంకితం చేశారని ట్వీట్ ద్వారా తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా, అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ముఖ్యమంత్రి పదవిని ప్రతిపాదించగా, దేవర్ దాన్ని తిరస్కరించారని రాధాకృష్ణన్ గుర్తుచేశారు. "నేతాజీకి న్యాయం జరగడం మాత్రమే తనకు కావాలని అప్పుడు నెహ్రూతో దేవర్ చెప్పారు" అని ఉపరాష్ట్రపతి వివరించారు.



# తడిసిన ధాన్యాన్నీ కొంటాం

**జగిత్యాల కలెక్టర్ సత్యప్రసాద్ స్పష్టీకరణ.. నేలవాలిన వరి పంటల పరిశీలన**

బీమారం, అక్టోబర్ 31 (ఈవార్తలు): మెంథా తుఫాను కారణంగా కురిసిన వర్షాలకు జిల్లాలోని భీమారం మండల కేంద్రంలో నేలకొరిగిన వరి పంటను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ ప్రత్యక్షంగా పరిశీలించారు. బీమారం మండలంలోని దేశాయిపేట గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని, కోరుట్ల మండలం మోహన్ రావుపేట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ.. మొలకలు వచ్చినా, రంగు మారినా ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా కల్పించారు. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా రైతులు అప్రమత్తంగా ఉండాలని, ధాన్యం తడవకుండా టార్ఫాలిన్లతో కప్పాలని, తడిసిన ధ్యాన్యాన్ని ఆరబెట్టాలని కోరారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్, డీఎస్‌వో జితేందర్ రెడ్డి, ఎమ్మార్వో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# వరి కొనుగోలు కేంద్రాల్లో ఏసీ తనిఖీలు

కొడిమ్యాల, మల్యాల, అక్టోబర్ 31 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాలోని కొడిమ్యాల, మల్యాల మండల కేంద్రాలతో పాటు నాచుపెల్లి, పూడూరు గ్రామాల్లోని ప్యాక్స్, ఏఎంసీ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం అదనపు కలెక్టర్ బీఎస్ లత పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో తూకపు యంత్రాలు తేమయంత్రాలు ప్యాడి క్లీనర్స్ టార్ఫలెన్లు సరిపోయినన్ని అందుబాటులో ఉన్నాయా అని తనిఖీ చేశారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సదుపాయాలను సమకూర్చాలని సూచించారు. కేంద్రంలో నిర్వాహకుల వివరాలు, మద్దతు ధర, టోల్ ఫ్రీ నెంబర్ వివరాలు స్పష్టంగా కనిపించేలా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని అన్నారు. రైతులు పంటను కొనుగోలు కేంద్రాలకు తీసుకురాగానే రసీదులు జారీ చేయడంతో పాటు వారి బ్యాంకు వివరాలను సక్రమంగా నమోదు చేసి పంట రుసుము సకాలంలో రైతులు ఖాతాలో జమ అయ్యేలా చూడాలని సూచించారు అన్ని రకాల రిజిస్టర్లు పకడ్బందీగా నిర్వహించాలని పేర్కొన్నారు.

# పీఎం పోషణ్‌లో జగిత్యాల భేష్

**విద్యాశాఖ సెక్రటరీ యోగితా రాణా కితాబు**

హైదరాబాద్, అక్టోబర్ 31 (ఈవార్తలు): పీఎం పోషణ్‌లో జగిత్యాల గొప్పగా రాణిస్తోందని విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణా కితాబునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆమె జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. విద్యా ప్రగతిపై సమీక్షిస్తూ పాఠశాలల్లో సివిల్ వర్క్స్ మీద దృష్టి పెట్టాలని, విద్యార్థుల హాజరు శాతం పెరిగేలా చూడాలని, పర్యవేక్షణలు కూడా నిర్వహించాలని, కేజీబీవీ పాఠశాలల్లో నిర్వహించే కాన్ అకాడమీ ఫిజిక్స్ వాలా తరగతులను కూడా పర్యవేక్షించాలని అన్నారు. తద్వారా విద్య అభివృద్ధికి పాటుపడాలని కలెక్టర్లకు సూచించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థల) బీ రాజ గౌడ్, డీఈవో కే రాము, ఇంటర్ జిల్లా అధికారి నారాయణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జాతీయ కబడ్డీ క్రీడాకారుడి హత్య

చండీగఢ్: పంజాబ్‌లో దారుణ ఘటన చోటుచేసుకుంది. జాతీయ స్థాయిలో రాణిస్తున్న ఓ కబడ్డీ క్రీడాకారుడిని స్నేహితులే అతి కిరాతకంగా కాల్చి చంపారు. పాత గొడవలే ఈ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. లూథియానా జిల్లాలోని జాగ్రావ్‌లో ఈ విషాదం జరిగింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం, జాతీయ స్థాయి కబడ్డీ ప్లేయర్ అయిన తేజ్‌పాల్ సింగ్ (26) తన ఇద్దరు స్నేహితులతో కలిసి ఓ ఫ్యాక్టరీకి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఈ క్రమంలో వారి మధ్య ఓ పాత గొడవకు సంబంధించి వాగ్వాదం మొదలైంది. కొద్దిసేపటికే అది తీవ్ర ఘర్షణకు దారితీసింది. మాటామాటా పెరగడంతో, వారితో కలిసిన మరో గుర్తుతెలియని వ్యక్తి తన వద్ద ఉన్న తుపాకీ తీసి తేజ్‌పాల్ ఛాతీపై కాల్పులు జరిపాడు. ఈ ఘటన సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్ఎస్పీ) కార్యాలయానికి సమీపంలోనే జరగడం గమనార్హం. రక్తపు మడుగులో పడి ఉన్న తేజ్‌పాల్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించారు. అయితే, ఆసుపత్రికి చేరుకునేలోపే అతను ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## నెలసరికి రుజువు చూపించాలన్న పైఅధికారులు

చండీగఢ్: హర్యానాలోని ఓ ప్రముఖ యూనివర్సిటీలో అత్యంత అమానవీయమైన, దారుణమైన ఘటన వెలుగులోకి వచ్చింది. రుతుస్రావం (నెలసరి) కారణంగా నెమ్మదిగా పనిచేస్తున్న ముగ్గురు మహిళా పారిశుద్ధ్య కార్మికులను వారి సూపర్‌వైజర్లు తీవ్రంగా వేధించారు. వారు చెప్పింది నమ్మకుండా, నెలసరిలో ఉన్నట్లు నిరూపించుకోవడానికి బట్టలు విప్పి, ఫోటోలు తీసి చూపించాలని బలవంతం చేసినట్లు ఆరోపణలు రావడం తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటన రోహ్‌తక్‌లోని మహర్షి దయానంద్ యూనివర్సిటీలో అక్టోబర్ 26న జరిగింది. ఈ విషయం బయటపడటంతో విద్యార్థి సంఘాలు, ఇతర సిబ్బంది పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. దీంతో యూనివర్సిటీ యాజమాన్యం తక్షణమే స్పందించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న సూపర్‌వైజర్లలో ఒకరిని వెంటనే సస్పెండ్ చేస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ కె.కె. గుప్తా ప్రకటించారు. ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, దోషులు ఎవరైనా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. అవసరమైతే నిందితులపై ఎస్సీ/ఎస్టీ చట్టం కింద కూడా కేసు నమోదు చేస్తామని తెలిపారు.

# నిజమే 14 వేల మందికి లేఆఫ్!

**ఆర్థిక సమస్యలు, ఏఐ కారణాలు కావు**

**అమెజాన్ సీఈవో ఆండీ జాస్సీ**

న్యూయార్క్: టెక్ దిగ్గజం అమెజాన్‌లో ఇటీవల ప్రకటించిన 14,000 ఉద్యోగాల తొలగింపుపై ఆ సంస్థ సీఈఓ ఆండీ జాస్సీ తొలిసారిగా స్పందించారు. ఈ భారీ లేఆఫ్స్‌కు ఆర్థిక ఇబ్బందులు గానీ, కృత్రిమ మేధస్సు (ఏఐ) వ్యాప్తి గానీ కారణం కాదని ఆయన స్పష్టం చేశారు. కంపెనీ వేగంగా విస్తరించడం వల్ల దెబ్బతిన్న 'కార్యాలయ సంస్కృతి'ని సరిదిద్దడానికే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని ఆయన వివరించారు. 'బిజినెస్ ఇన్‌సైడర్'కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆండీ జాస్సీ మాట్లాడుతూ, "మేము ఇటీవల తీసుకున్న నిర్ణయం వెనుక ఆర్థిక కారణాలు లేవు. ప్రస్తుతానికి ఏఐ కూడా కాదు. ఇది పూర్తిగా మా కంపెనీ కల్చర్‌కు సంబంధించిన విషయం" అని తెలిపారు. గత కొన్నేళ్లుగా కంపెనీ వ్యాపారాలు, ఉద్యోగుల సంఖ్య, కార్యాలయాలు విపరీతంగా పెరిగాయని, దీనివల్ల సంస్థలో అనవసరమైన స్థాయిలు (లేయర్స్) పెరిగిపోయాయని ఆయన పేర్కొన్నారు. "ఇలా జరిగినప్పుడు, క్షేత్రస్థాయిలో పనిచేసే వారిలో ఓనర్‌షిప్ భావన తగ్గిపోతుంది. ఇది కంపెనీ వేగాన్ని మందగింపజేస్తుంది" అని జాసీ విశ్లేషించారు. అయితే, ఆండీ జాస్సీ వ్యాఖ్యలకు, కంపెనీలోని ఇతర ఉన్నతాధికారుల ప్రకటనలకు మధ్య స్పష్టమైన వైరుధ్యం కనిపిస్తోంది. అక్టోబర్ 28న ఈ తొలగింపులను ప్రకటిస్తూ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ బెత్ గలెట్టి తన బ్లాగ్ పోస్ట్‌లో ఏఐ ప్రభావాన్ని ప్రస్తావించారు. "ఇంటర్నెట్ తర్వాత ఏఐ అత్యంత పరివర్తనాత్మక సాంకేతికత. దీని ద్వారా వేగంగా ఆవిష్కరణలు చేపట్టాలంటే, మా సంస్థ తక్కువ స్థాయిలతో, ఎక్కువ ఓనర్‌షిప్‌తో చురుగ్గా (లీన్‌గా) ఉండాలి" అని ఆమె పేర్కొన్నారు.

# కోర్టు ఆదేశాలంటే లెక్కలేదా

**రాష్ట్రాల సీఎస్‌లపై సుప్రీంకోర్టు ఆగ్రహం**

**భౌతికంగా హాజరుకావాల్సిందేనని ఆదేశం**


**వీధికుక్కల కేసులో రాష్ట్రాలపై మండిపాటు**

న్యూఢిల్లీ: వీధి కుక్కల నియంత్రణ కేసులో పలు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శుల (సీఎస్‌లు) తీరుపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాలను పాటించని సీఎస్‌లు నవంబర్ 3న జరిగే విచారణకు భౌతికంగా హాజరు కావాల్సిందేనని స్పష్టం చేసింది. వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలన్న సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా విజ్ఞప్తిని ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ కేసుకు సంబంధించి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా శుక్రవారం జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ముందు ప్రస్తావించారు. సదరు సీఎస్‌లను వర్చువల్‌గా హాజరయ్యేందుకు అనుమతించాలని కోరారు. దీనిపై ధర్మాసనం తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. "కంప్లయన్స్ అఫిడవిట్ దాఖలు చేయమని మేము ఆదేశిస్తే, వాళ్లు నిద్రపోతున్నారు. కోర్టు ఆదేశాల పట్ల ఏమాత్రం గౌరవం లేదు. సరే, అయితే వాళ్లనే రానివ్వండి" అని జస్టిస్ విక్రమ్ నాథ్ ఘాటుగా వ్యాఖ్యానించారు. వీధి కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై ఆగస్టు 22న ఇచ్చిన ఆదేశాల మేరకు కంప్లయన్స్ అఫిడవిట్లు దాఖలు చేయనందున, పశ్చిమ బెంగాల్, తెలంగాణ మినహా అన్ని రాష్ట్రాల సీఎస్‌లు నవంబర్ 3న తమ ముందు హాజరు కావాలని సుప్రీంకోర్టు అక్టోబర్ 27న ఆదేశించిన విషయం తెలిసిందే. ఆగస్టు 22న సుప్రీంకోర్టు ఈ కేసు పరిధిని ఢిల్లీ-ఎన్‌సీఆర్ నుంచి దేశవ్యాప్తంగా విస్తరించింది. జంతు జనన నియంత్రణ (ఏబీసీ) నిబంధనల అమలుకు అవసరమైన వనరుల (డాగ్ పౌండ్స్, పశువైద్యులు, కుక్కలను పట్టే సిబ్బంది, వాహనాలు, బోనులు) పూర్తి గణాంకాలతో అఫిడవిట్లు దాఖలు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల మున్సిపల్ అధికారులను ఆదేశించింది. ఏబీసీ నిబంధనలు దేశమంతటా ఒకేలా వర్తిస్తాయని పేర్కొంటూ రాష్ట్రాలను ఈ కేసులో ప్రతివాదులుగా చేర్చింది. ఢిల్లీలో వీధి కుక్కల కాటు వల్ల చిన్నారులు రేబిస్ బారిన పడుతున్నారంటూ వచ్చిన మీడియా కథనాల ఆధారంగా సుప్రీంకోర్టు జూలై 28న ఈ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ జరుపుతోంది.

# చైనాకు పెరగనున్న విమాన సర్వీసులు

## ఢిల్లీ-షాంఘై మధ్య విమాన సర్వీసులు పెంపు.. వచ్చే ఏడాది జనవరి 2 నుంచి వారానికి 5 ఫ్లైట్స్

న్యూఢిల్లీ: భారత్, చైనా మధ్య విమాన ప్రయాణాలు తిరిగి పుంజుకుంటున్నాయి. ప్రముఖ విమానయాన సంస్థ 'చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్', షాంఘై-న్యూఢిల్లీ మధ్య డైరెక్ట్ విమానాల సంఖ్యను పెంచుతున్నట్లు శుక్రవారం ప్రకటించింది. భారత మార్కెట్ నుంచి బలమైన డిమాండ్ ఉన్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. వారానికి మూడుగా ఉన్న సర్వీసులను 2026 జనవరి 2 నుంచి ఐదుకు పెంచనుంది. ఈ క్యారియర్ విడుదల చేసిన ప్రకటన ప్రకారం ఢిల్లీ నుంచి బయలుదేరే విమానం (ఎంయూ564) రాత్రి 7:55 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 4:10 గంటలకు షాంఘై చేరుకుంటుంది. షాంఘై నుంచి బయలుదేరే విమానం (ఎంయూ563) మధ్యాహ్నం 12:50 గంటలకు ప్రారంభమై, సాయంత్రం 5:45 గంటలకు (స్థానిక కాలమానం ప్రకారం) న్యూఢిల్లీలో ల్యాండ్ అవుతుంది. సోమ, బుధ, శుక్ర, శని, ఆదివారాల్లో ఈ సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ సర్వీసుల కోసం 17 బిజినెస్-క్లాస్, 245 ఎకానమీ-క్లాస్ సీట్లు ఉన్న ఎయిర్‌బస్ ఏ330-200 వైడ్-బాడీ విమానాలను ఉపయోగించనున్నారు. భారత్‌లో ఈ విమానయాన సంస్థకు సంబంధించిన సేల్స్, మార్కెటింగ్, టికెటింగ్ వంటి వాణిజ్య కార్యకలాపాలను ఇంటర్‌గ్లోబ్ ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ పర్యవేక్షించనుంది. భవిష్యత్తులో కున్మింగ్-కోల్‌కతా, షాంఘై-ముంబై మార్గాల్లోనూ కొత్త సర్వీసులను ప్రారంభించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు కంపెనీ పేర్కొంది. ఈ విమాన సర్వీసుల పెంపుతో ఇరు దేశాల మధ్య వాణిజ్యం, పర్యాటకం, విద్య, సాంస్కృతిక సంబంధాలు మరింత బలోపేతం




అవుతాయని ఆశాభావం వ్యక్తం చేసింది. దాదాపు ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత చైనా ఈస్టర్న్ ఎయిర్‌లైన్స్ ఈ ఏడాది నవంబర్ 9 నుంచి షాంఘై-ఢిల్లీ మార్గంలో విమానాలను తిరిగి ప్రారంభిస్తున్న విషయం తెలిసిందే. ట్రావెల్ డేటా ప్రొవైడర్ %ూూ+% ప్రకారం, సర్వీసులు నిలిచిపోవడానికి ముందు 2019లో ఇరు దేశాల మధ్య దాదాపు 2,588 షెడ్యూల్డ్ విమానాలు నడిచాయి.

## అమెరికా-భారత్ రక్షణ ఒప్పందం

**ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం**

**పదేళ్ల పాటు ఉండే ఒప్పందంపై సంతకం**

**రాజ్‌నాథ్‌తో భేటీ సంతోషం: రక్షణ మంత్రి**

కౌలాలంపూర్: అమెరికా, భారత దేశాల మధ్య కీలక రక్షణ ఒప్పందం కుదిరింది. మలేషియాలో ఆసియాన్ రక్షణ మంత్రుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్‌లు సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక, భద్రత సహకారాన్ని పెంపొందించేందుకు ఉద్దేశించిన ఈ ఒప్పందం పదేళ్ల పాటు కొనసాగనుంది. ఈ సందర్భంగా హెగ్సెత్ సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' ద్వారా స్పందిస్తూ, పదేళ్ల రక్షణ ఒప్పందంపై సంతకం చేయడానికి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశం కావడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. ఇది ఇరు దేశాల రక్షణ భాగస్వామ్యాన్ని ముందుకు తీసుకువెళుతుందని ఆయన అన్నారు.

## ప్రాణ రక్షణకే 'బంగ్లా'ను విడిచా

**ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా**

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా తన ప్రవాసంపై తొలిసారిగా మౌనం వీడారు. తన ప్రాణాలను, తన చుట్టూ ఉన్నవారి భద్రతను కాపాడేందుకే దేశం విడిచి పెట్టాల్సి వచ్చిందని, అదొక 'తప్పనిసరి అవసరం'గా మారిందని ఆమె స్పష్టం చేశారు. తన పాలనను కూల్చివేసిన విద్యార్థుల నిరసనలను 'హింసాత్మక తిరుగుబాటు'గా అభివర్ణించిన ఆమె, భద్రతా బలగాలు కాల్పులు జరపాలని తాను ఆదేశించానన్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. బ్రిటిష్ మీడియా సంస్థ 'ది ఇండిపెండెంట్'కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో హసీనా పలు కీలక విషయాలు వెల్లడించారు. "నేను అక్కడ ఉండి ఉంటే నా ప్రాణాలకే కాదు, నా చుట్టూ ఉన్నవారికి కూడా ప్రమాదం వాటిల్లేది" అని ఆమె పేర్కొన్నారు. గత ఏడాది ఆగస్టు 5న ఆమె దేశం విడిచి భారత్ కు వచ్చేసిన విషయం తెలిసిందే. బంగ్లాదేశ్‌లో తన అవామీ లీగ్ పార్టీపై నిషేధం ఉన్నప్పటికీ, దేశంలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించడమే తన లక్ష్యమని ఆమె పునరుద్ఘాటించారు. స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలకు ఉద్యోగాల్లో కోటాను రద్దు చేయాలనే డిమాండ్‌తో మొదలైన విద్యార్థుల నిరసనలు, చివరికి తన ప్రభుత్వాన్ని కూల్చివేసే స్థాయికి చేరాయని హసీనా అన్నారు.

# భారీగా పతనమైన సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు శుక్రవారం నష్టాలతో ముగిశాయి. వారం చివరి ట్రేడింగ్ సెషన్‌లో దాదాపు అన్ని రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించడంతో సూచీలు భారీగా పతనమయ్యాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలు, వారాంతం కావడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గుచూపడం మార్కెట్ల పతనానికి ప్రధాన కారణమైంది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 466.75 పాయింట్లు నష్టపోయి 83,938.71 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 155.75 పాయింట్లు క్షీణించి 25,722.10 వద్ద ముగిసింది. దాదాపు అన్ని సెన్సెక్స్ షేర్లు నష్టాల్లోనే ట్రేడ్ అవగా, బీఈఎల్, లార్సెన్ %డ% టూబ్రో, టీసీఎస్, ఐటీసీ, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వంటి అతికొద్ది హెవీవెయిట్ షేర్లు మాత్రమే లాభాలను నమోదు చేశాయి. మరోవైపు, ఎన్టీపీసీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, బజాజ్ ఫిన్‌సర్వ్, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి షేర్లు తీవ్రంగా నష్టపోయాయి. కొన్ని కౌంటర్లలో నష్టాలు 3.45 శాతం వరకు ఉన్నాయి. మార్కెట్ బలహీనత బ్రాడర్ మార్కెట్లలోనూ కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.45 శాతం, స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.48 శాతం చొప్పున




నష్టపోయాయి. రంగాల వారీగా చూస్తే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ (1.5 శాతం), నిఫ్టీ ఆయిల్ %డ% గ్యాస్ (0.07 శాతం) సూచీలు మాత్రమే స్వల్ప లాభాలతో గట్టెక్కాయి. మిగిలిన అన్ని రంగాలు నష్టాల్లో ముగియగా, నిఫ్టీ మెటల్, నిఫ్టీ మీడియా సూచీలు ఒక శాతానికి పైగా పతనమై అత్యధికంగా నష్టపోయిన వాటిలో ముందున్నాయి. మిశ్రమ కార్పొరేట్ ఫలితాలు, అమెరికా డాలర్ బలపడటం, ఫెడ్ ఛైర్మన్ పావెల్ వ్యాఖ్యల నేపథ్యంలో విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాలకు దిగడం కూడా మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీసిందని మార్కెట్ వర్గాలు విశ్లేషించాయి. నిపుణుల అంచనా ప్రకారం, నిఫ్టీ 25,660 స్థాయికి పైన ఉన్నంతవరకు మార్కెట్ బ్రాడర్ ట్రెండ్‌కు ఢోకా లేదని, అయితే ఆ స్థాయిని కోల్పోతే 25,400-25,250 స్థాయిలకు పడిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఒకవేళ నిఫ్టీ తిరిగి 26,000 స్థాయిని దాటితే బుల్స్ పట్టు సాధించి 26,300 వైపు పయనించే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల్లో మార్కెట్ పడినప్పుడు కొనుగోలు చేసే (బై ఆన్ డిప్స్) వ్యూహం కొనసాగవచ్చని వారు అభిప్రాయపడ్డారు.

# జాతీయ సంస్థల విశ్వసనీయత దెబ్బతీయొద్దు

**రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై అజిత్ దోవల్ పరోక్ష విమర్శలు**

న్యూఢిల్లీ: దేశంలోని కీలక వ్యవస్థల విశ్వసనీయతను దెబ్బతీసేందుకు దుష్ప్రచారాలు తీచేస్తున్నారంటూ జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని శక్తులు ఉద్దేశపూర్వకంగా రక్షణ, న్యాయ, ఎన్నికల వ్యవస్థల వంటి అత్యంత పవిత్రమైన సంస్థల ప్రతిష్ఠను కించపరిచే ప్రయత్నం చేస్తున్నాయని, ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. ఎన్నికల నిర్వహణలో పక్షపాతం జరుగుతోందంటూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వంటి వారు ఎన్నికల సంఘంపై విమర్శలు చేస్తున్న తరుణంలో, దోవల్ పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. శుక్రవారం 'రాష్ట్రీయ ఏక్తా దివస్' సందర్భంగా 'పరిపాలన' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. "రక్షణ దళాలు, భద్రతా బలగాలు, న్యాయవ్యవస్థ, కాగ్, ఎన్నికల వ్యవస్థ వంటి కీలక సంస్థలే లక్ష్యంగా కొన్ని శక్తులు దుష్ప్రచారం చేస్తున్నాయి. ఈ సంస్థల



విశ్వసనీయతను దుష్ప్రచారం, విద్వేషపూరిత ప్రచారాలు లేదా సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం దెబ్బతీయడానికి ఎట్టిపరిస్థితుల్లోనూ అనుమతించకూడదు. ఈ వ్యవస్థలు అత్యంత పవిత్రమైనవి" అని దోవల్ స్పష్టం చేశారు. ఇలాంటి చర్యలు దేశానికి అత్యంత వినాశకరమైనవి అవుతాయని హెచ్చరించారు. దేశ ప్రతిష్ఠకు భంగం కలిగితే, అది జాతీయ సంకల్పాన్ని దెబ్బతీస్తుందని, ప్రజలు దేశ ఆర్థిక, ఎన్నికల వ్యవస్థలపై నమ్మకం కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన అన్నారు. దీనిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం 'పర్సెప్షన్ మేనేజ్‌మెంట్' (ప్రజాభిప్రాయ నిర్వహణ)పై మరింత దృష్టి పెట్టాలని, ప్రజల్లో సరైన అవగాహన కల్పించాలని సూచించారు. పరిపాలనలో జవాబుదారీతనం పెరగాలని, తప్పు చేసిన వారిపై ఏమాత్రం సహనం చూపకూడదని దోవల్ అభిప్రాయపడ్డారు. "తప్పుడు స్థానంలో చూపించే జాలి అత్యంత చెత్త నాణ్యతకు నిదర్శనం" అని ఆయన వ్యాఖ్యానించారు. తప్పు చేసిన వారిని రక్షించే వారికి కూడా కఠిన శిక్షలు ఉండాలని ఆయన స్పష్టం చేశారు. పోలీసు శాఖలో అవినీతిని తగ్గించేందుకు తాను గతంలో చేసిన ఓ సూచనను ఈ సందర్భంగా గుర్తుచేశారు. "ఒక పోలీసు అధికారి అవినీతికి పాల్పడితే, అతని పై అధికారికి చెందిన సర్వీస్ రికార్డులో రిమార్కు నమోదు చేయాలి. తన కింద పనిచేసే వారి అవినీతిని నియంత్రించలేకపోయారని పేర్కొనాలి. అప్పుడు పై అధికారి తన ప్రయోజనాల కోసమైనా కింది స్థాయి సిబ్బంది అవినీతిని కనీసం 50 శాతం తగ్గిస్తారు," అని దోవల్ వివరించారు.

# కింగ్ చార్లెస్ సోదరుడి గెంటివేత

**ఆండ్రూ రాచరిక బిరుదులు రద్దు**

**లైంగిక నేరస్థుడు ఎప్‌స్టీన్‌తో సంబంధాల వల్లే**

లండన్: బ్రిటన్ రాజకుటుంబంలో సంచలనం చోటుచేసుకుంది. లైంగిక నేరస్థుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో సంబంధాలున్నాయన్న ఆరోపణలతో తీవ్ర వివాదంలో చిక్కుకున్న తన సోదరుడు ప్రిన్స్ ఆండ్రూపై బ్రిటన్ రాజు చార్లెస్-3 కఠిన చర్యలు తీసుకున్నారు. ఆండ్రూకు ఉన్న అన్ని రాచరిక బిరుదులను రద్దు చేయడంతో పాటు, విండ్సర్ ప్యాలెస్‌లోని ఆయన నివాసాన్ని తక్షణమే ఖాళీ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు బకింగ్‌హామ్ ప్యాలెస్ గురువారం ఓ అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ నిర్ణయంతో ఆండ్రూ ఇకపై 'ప్రిన్స్' అనే గౌరవాన్ని కోల్పోనున్నారు. ఆయన్ను కేవలం ఆండ్రూ మౌంట్‌బాటన్ విండ్సర్‌గా మాత్రమే పిలవాల్సి ఉంటుంది. ఎప్‌స్టీన్‌తో ఆండ్రూ సంబంధాలపై రాజకుటుంబం కొన్నేళ్లుగా తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఎప్‌స్టీన్ బాధితుల్లో ఒకరైన వర్జీనియా రాబర్ట్స్ గిఫ్రే చేసిన లైంగిక ఆరోపణలతో ఈ వివాదం మరింత ముదిరింది. ఇటీవల బయటపడిన ఈ-మెయిల్స్ ప్రకారం, తాను చెప్పినదానికంటే ఎక్కువ కాలం ఆండ్రూ.. ఎప్‌స్టీన్‌తో సంబంధాలు కొనసాగించినట్లు తేలడంతో ఆయనపై వ్యతిరేకత పెరిగింది. "ఆండ్రూ తనపై వచ్చిన ఆరోపణలను ఖండిస్తున్నప్పటికీ, ఆయన తీర్పులో తీవ్రమైన లోపం ఉందని భావించి ఈ చర్యలు అవసరమని నిర్ణయించాం" అని బకింగ్‌హామ్ ప్యాలెస్ తమ ప్రకటనలో పేర్కొంది. లైంగిక వేధింపుల బాధితులు, ప్రాణాలతో బయటపడినవారికి తమ ప్రగాఢ సానుభూతి ఎల్లప్పుడూ ఉంటుందని రాజు, రాణి స్పష్టం చేశారు. 2019లో బీబీసీకి ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తనపై వచ్చిన ఆరోపణలను ఖండించే ప్రయత్నం చేసి



ఆండ్రూ అభాసుపాలయ్యారు. ఆ తర్వాత రాచరిక విధులకు దూరంగా ఉన్నారు. 2022లో గిఫ్రే న్యూయార్క్‌లో దాఖలు చేసిన సివిల్ దావాలో ఆండ్రూ కోర్టు బయట మిలియన్ల డాలర్లు చెల్లించి సెటిల్‌మెంట్ చేసుకున్నారు. ఆ సమయంలో తాను ఎలాంటి తప్పు చేయలేదని చెప్పినప్పటికీ, లైంగిక వేధింపుల బాధితురాలిగా ఆమె పడిన బాధను గుర్తించారు. కాగా, గిఫ్రే (41) ఈ ఏడాది ఏప్రిల్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. తాజా ఆదేశాలతో ఆండ్రూ.. రాజుకు చెందిన శాండ్రింగ్‌హామ్ ఎస్టేట్‌లోని ఓ ప్రైవేట్ నివాసానికి మారే అవకాశం ఉంది. ఆయనకు సోదరుడి నుంచి వ్యక్తిగత ఆర్థిక సహాయం అందనుంది. 30 గదుల విలాసవంతమైన భవంతిలో ఆండ్రూతో నివసిస్తున్న ఆయన మాజీ భార్య సారా ఫెర్గూసన్ కూడా కొత్త నివాసాన్ని వెతుక్కోవాల్సి ఉంటుంది.

# టెస్లా బుక్ చేసి ఏడున్నరేళ్లయ్యింది!

**ఇప్పటివరకు డెలివరీ అందలేదు**

**ఓపెన్ ఏఐ సీఈవో శామ్ ఆల్ట్ మన్**

వాషింగ్టన్: ఓపెన్‌ఏఐ వ్యవస్థాపకుడు, సీఈవో శామ్ ఆల్ట్‌మన్‌కు టెస్లా కంపెనీ నుంచి ఊహించని అనుభవం ఎదురైంది. తాను ఏడున్నర సంవత్సరాల క్రితం బుక్ చేసుకున్న టెస్లా కారు ఇప్పటికీ డెలివరీ కాలేదని ఆయన శుక్రవారం సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. ఈ కారు కోసం తాను 45,000 డాలర్ల (సుమారు రూ. 37.5 లక్షలు) రిజర్వేషన్ ఫీజు కూడా చెల్లించినట్లు తెలిపారు. ఇంతకాలం ఎదురుచూసినా కారు రాకపోవడంతో, తన ఆర్డర్‌ను రద్దు చేసుకుని, డబ్బులు వాపసు తీసుకోవాలని నిర్ణయించుకున్నట్లు ఆల్ట్‌మన్ చెప్పారు. ఈ మేరకు ఆయన టెస్లా కంపెనీకి పంపిన ఈ-మెయిల్‌కు సంబంధించిన మూడు స్క్రీన్‌షాట్‌లను సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మొదటి స్క్రీన్‌షాట్‌లో ఆయన కారు బుక్ చేసుకున్నట్లు ధృవీకరిస్తూ వచ్చిన మెయిల్ ఉంది. రెండో దానిలో తన ఆర్డర్‌ను రద్దు చేసి, రీఫండ్ ఇవ్వాలని కోరుతూ టెస్లాకు పంపిన ఈ-మెయిల్ ఉంది. అయితే, మూడో స్క్రీన్‌షాట్ అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఆయన పంపిన ఈ-మెయిల్ "అడ్రస్ నాట్ ఫౌండ్" అనే ఎర్రర్ మెసేజ్‌తో బౌన్స్ అయినట్లు అందులో ఉంది. ఈ మూడు






చిత్రాలను పంచుకుంటూ, "మూడు అంకాల్లో ఒక కథ" అని ఆల్ట్‌మన్ క్యాప్షన్ పెట్టారు. "నిజానికి ఆ కారు కోసం నేను చాలా ఉత్సాహంగా ఎదురుచూశాను. ఆలస్యం కావడం సహజమేనని అర్థం చేసుకోగలను. కానీ, ఏడున్నరేళ్లు వేచి ఉండటం చాలా ఎక్కువ సమయం అనిపించింది" అని ఆయన మరో కామెంట్‌లో పేర్కొన్నారు. ఈ పోస్ట్ కొద్దిసేపట్లోనే వైరల్‌గా మారింది. వేలాది మంది నెటిజన్లు దీనిపై స్పందించారు. ఈ క్రమంలో శామ్ ఆల్ట్‌మన్ సోదరుడు జాక్ ఆల్ట్‌మన్ సరదాగా స్పందించారు. శామ్ పాత ఫొటోను షేర్ చేస్తూ, "50 బిలియన్ డాలర్లు ఖర్చైనా నేను పట్టించుకోను అని చెప్పే నువ్వు, ఇప్పుడు 50 వేల డాలర్ల కోసం ఇంతలా చింతిస్తున్నావా?" అని ఆటపట్టించారు. దీనికి శామ్ కూడా నవ్వుతూ, "తమ్ముళ్ల తీరే ఇంత" అంటూ చమత్కారంగా బదులిచ్చారు.

## ఆరెస్సెస్‌ను బ్యాన్ చేయాలి

**కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే**



న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆరెస్సెస్)ను నిషేధించాలన్నది తన వ్యక్తిగత అభిప్రాయమని, దేశ తొలి ఉప ప్రధానమంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఆరెస్సెస్ కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిషేధించారని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పునరుద్ఘాటించారు. దేశంలో ఎక్కువగా శాంతిభద్రతల సమస్య తలెత్తడానికి ఆరెస్సెస్, బీజేపీ కారణమని ఆయన ఆరోపించారు. ఈ క్రమంలో నిషేధించాలనేది తన అభిప్రాయమన్నారు. శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్, ఉక్కు మహిళ ఇందిరాగాంధీ దేశానికి ఎంతో సేవ చేశారని కొనియాడారు. జాతి ఐక్యతకు వారు ఎంతో చేశారని అన్నారు. ఆరెస్సెస్ నిషేధం అంశంపై కూడా ఆయన స్పందించారు. దాని భావజాలం విషంతో సమానమని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మహాత్మాగాంధీ హత్యకు దారితీసిన వాతావరణాన్ని ఆరెస్సెస్ సృష్టించిందని మండిపడ్డారు. ఇదే విషయాన్ని పేర్కొంటూ సర్దార్ వల్లభాయ్ పటేల్... శ్యాంప్రసాద్ ముఖర్జీకి లేఖ రాశారని తెలిపారు. పటేల్, నెహ్రూ మధ్య సత్సంబంధాలు ఉన్నప్పటికీ వారి మధ్య చీలిక తేవడానికి ప్రయత్నించారని ఆరోపించారు. కశ్మీర్ మొత్తాన్ని భారతదేశంలో కలపాలని పటేల్ అనుకున్నారని, కానీ నెహ్రూ ఆ ప్రయత్నాలను అడ్డుకున్నారని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. మోదీ వ్యాఖ్యలపై ఖర్గే పైవిధంగా స్పందించారు. ఖర్గే వ్యాఖ్యలపై బీజేపీ కూడా స్పందించింది. దశాబ్దాల పాటు సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలను కాంగ్రెస్ ఎందుకు విస్మరించిందని ప్రశ్నించింది.

## హెచ్-1బీలపై ట్రంప్ అక్కసు

**భారత్‌ను నిందిస్తూ వీడియో**

వాషింగ్టన్: అమెరికాలో వలసదారుల విషయంలో మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తున్న కఠిన వైఖరి మరోసారి బయటపడింది. అమెరికా ఆర్థిక వ్యవస్థకు కీలకమైన వలసదారులను లక్ష్యంగా చేసుకుంటూ వస్తున్న ఆయన యంత్రాంగం, తాజాగా హెచ్-1బీ వీసాదారులపై దృష్టి సారించింది. ఈ వీసా విధానాన్ని కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయంటూ అమెరికా లేబర్ డిపార్ట్‌మెంట్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక యాడ్ వీడియోను విడుదల చేసింది. ఈ వీడియోలో, అమెరికన్ యువత స్థానంలో కంపెనీలు విదేశీ కార్మికులను నియమించుకుంటున్నాయని తీవ్ర ఆరోపణలు చేసింది. హెచ్-1బీ వీసాల ద్వారా తక్కువ జీతాలకు విదేశీయులను పనిలో పెట్టుకుంటూ, స్థానిక అమెరికన్లకు అన్యాయం చేస్తున్నాయని విమర్శించింది. ముఖ్యంగా, ఈ వీసా పొందుతున్న వారిలో అత్యధికులు భారతీయులే ఉన్నారని ప్రత్యేకంగా ప్రస్తావించడం గమనార్హం. అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి ట్రంప్ వలస విధానాలపై కఠినంగా వ్యవహరిస్తున్న సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులను భారీగా దేశం నుంచి పంపించివేయడం (మాస్ డిపోర్టేషన్), అరెస్టులు, చట్టబద్ధమైన ప్రవేశాలపై కూడా కఠిన ఆంక్షలు విధిస్తూ వచ్చారు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న వేళ, మరోసారి వలసవాదాన్ని ప్రధాన అస్త్రంగా వాడుతున్నారు. అందులో భాగంగానే, భారతీయ టెకీలకు అత్యంత కీలకమైన హెచ్-1బీ వీసాను లక్ష్యంగా చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

## భారత్‌లో ఆల్‌టైం రికార్డ్ రెవెన్యూ


**యాపిల్ సీఈఓ టిమ్ కుక్ వెల్లడి**

న్యూఢిల్లీ: టెక్ దిగ్గజం యాపిల్, సెప్టెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో అద్భుతమైన ఆర్థిక ఫలితాలను నమోదు చేసింది. ముఖ్యంగా భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో రికార్డు స్థాయిలో ఆదాయం సాధించినట్లు కంపెనీ సీఈఓ టిమ్ కుక్ వెల్లడించారు. ఐఫోన్ల అమ్మకాలు భారీగా పెరగడంతో ఇండియాలో తమకు ఆల్ టైమ్ రెవెన్యూ రికార్డ్ నమోదైందని ఆయన స్పష్టం చేశారు. గురువారం కంపెనీ ఆర్థిక ఫలితాలను విడుదల చేసిన అనంతరం టిమ్ కుక్ విశ్లేషకులతో మాట్లాడారు. "భారత్, యూఏఈ వంటి వర్ధమాన మార్కెట్లలో కొత్త స్టోర్లను ప్రారంభించాం. మా అత్యుత్తమ ఉత్పత్తులతో ఈ ఏడాది అత్యంత రద్దీ సీజన్‌కు సిద్ధమవుతున్నాం" అని ఆయన తెలిపారు. అమెరికా, కెనడా, పశ్చిమ యూరప్, జపాన్, కొరియా వంటి డజన్ల కొద్దీ దేశాల్లో కూడా రికార్డు స్థాయి అమ్మకాలు నమోదైనట్లు టిమ్ కుక్ వెల్లడించారు. ఈ త్రైమాసికంలో ఐఫోన్ల ద్వారా ప్రపంచవ్యాప్తంగా 49 బిలియన్ డాలర్ల ఆదాయం వచ్చిందని, ఇది గత ఏడాదితో పోలిస్తే 6 శాతం అధికమని కంపెనీ పేర్కొంది. యాపిల్ సీఎఫ్ఓ కెవాన్ పరేఖ్ మాట్లాడుతూ... "భారత్‌లో ఆల్ టైమ్ రికార్డ్ నమోదు చేశాం. లాటిన్ అమెరికా, మధ్యప్రాచ్యం, దక్షిణాసియా వంటి అనేక అభివృద్ధి చెందుతున్న మార్కెట్లలో సెప్టెంబర్ త్రైమాసికంలో రికార్డులు సృష్టించాం" అని వివరించారు. 2025 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో (సెప్టెంబర్ 27తో ముగిసిన) యాపిల్ మొత్తం 102.5 బిలియన్ డాలర్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఇది గత ఏడాదితో పోలిస్తే 8 శాతం ఎక్కువ.

## నా భార్య క్రైస్తవురాలిగా మారుతుంది

**అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ వెల్లడి**

**మతం మారకపోయినా తనకు ఇబ్బంది లేదని స్పష్టీకరణ**



వాషింగ్టన్: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ తన భార్య ఉషా వాన్స్ మత మార్పిడిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హిందువుగా ఉన్న తన భార్య ఏదో ఒక రోజు క్రైస్తవ మతాన్ని స్వీకరించవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకవేళ ఆమె మతం మారకపోయినా తనకేమీ అభ్యంతరం లేదని స్పష్టం చేశారు. బుధవారం మిస్సిసిపీలో జరిగిన "టర్నింగ్ పాయింట్ యూఎస్ఏ" కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా జేడీ వాన్స్ మాట్లాడుతూ.. "ప్రస్తుతం ఉష ప్రతి ఆదివారం నాతో పాటు చర్చికి వస్తోంది. నేను చర్చి ద్వారా ఎలా ప్రభావితమయ్యానో, ఆమె కూడా అలాగే ప్రభావితమవుతుందని ఆశిస్తున్నా. ఈ విషయాన్ని నా అత్యంత సన్నిహితులైన పది వేల మంది స్నేహితుల ముందు చెబుతున్నా. ఇది జరగాలని నేను నిజాయతీగా కోరుకుంటున్నాను. ఎందుకంటే క్రైస్తవ సువార్తపై నాకు బలమైన విశ్వాసం ఉంది. నా భార్య కూడా అదే మార్గంలో నడుస్తుందని భావిస్తున్నా" అని వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రేక్షకుల నుంచి "మీ భార్య ఉష క్రైస్తవ మతంలోకి మారతారా?" అని ప్రశ్న ఎదురైంది. దీనికి ఆయన సమాధానమిస్తూ "చివరికి ఆమె క్రీస్తు వద్దకు రావలసి ఉంది కదా!" అని వ్యాఖ్యానించారు. జేడీ వాన్స్ క్రైస్తవ మత విశ్వాసాలకు కట్టుబడి ఉండగా, ఆయన భార్య ఉష భారతీయ మూలాలున్న హిందూ కుటుంబానికి చెందినవారు.

## కెనడాలో భారత వ్యక్తికి 25 ఏళ్ల జైలు శిక్ష

ఒట్టావా: మూడేళ్ల క్రితం జరిగిన ఒక హత్య కేసులో భారత సంతతికి చెందిన వ్యక్తికి కెనడా న్యాయస్థానం 25 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 2022 అక్టోబర్ 17న వాంకోవర్‌లోని ఒక గోల్ఫ్ క్లబ్‌లో విశాల్ వాలియా అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. కారులో వెళుతున్న సమయంలో అతడిని కాల్చి చంపిన నిందితులు, ఆ తర్వాత ఆ కారును తగులబెట్టారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేయగా, భారత సంతతికి చెందిన బాలరాజ్ సింగ్ బాస్రాతో పాటు ఇక్బాల్ కాంగ్, డియాండ్రే బాప్టిస్ట్‌లు ఈ హత్య చేసినట్లు తేలింది. సాక్ష్యాధారాలు మాయం చేయడానికి వాహనాన్ని తగులబెట్టినట్లు కూడా దర్యాప్తులో వెల్లడైంది.

కస్తూరి చిత్రం




రష్మి గౌతమ్



## అవకాశం వస్తే ఇప్పటికీ సిద్ధమే!

ప్రముఖ నటి అందాల తార కస్తూరి శంకర్ గురించి పరిచయాలు ప్రత్యేకంగా అవసరం లేదు. ముఖ్యంగా ఒకప్పుడు అన్నమయ్య వంటి ఆధ్యాత్మిక చిత్రాలలో నటించిన ఈమె ఇప్పుడు ఇంటింటి గృహలక్ష్మి అనే సీరియల్ లో నటించి అటు వెండితెరకు ఇటు బుల్లితెరకి కూడా పరిచయమైంది. ఇప్పుడు తాజాగా ఒక మీడియా ఛానల్ కు ఇచ్చిన పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో ఎన్నో విషయాలు పంచుకున్న ఈమె.. అవకాశం వస్తే ఇప్పటికీ సిద్ధమే అంటూ చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. అంతేకాదు ఇదే ఇంటర్వ్యూలో తన జీవితంలో కొన్ని వ్యక్తిగత జ్ఞాపకాలను అలాగే హీరో నాగార్జునపై తన టీనేజ్ లవ్ స్టోరీ గురించి చెప్పుకొచ్చారు. మరి అసలు విషయం ఏమిటో ఇప్పుడు చూద్దాం.. కస్తూరి శంకర్ మాట్లాడుతూ.." నేను చదువుకునే రోజుల్లోనే నాగార్జున పై ఇష్టం పెంచుకున్నాను. ఆ రోజుల్లోనే ఒకసారి కలిశాను కూడా. ముఖ్యంగా ఆరోజు ఆయన వేసుకున్న షర్ట్ దగ్గర నుంచి ఆయన చూసిన చూపు వరకు ప్రతీదీ ఇప్పటికీ గుర్తుంది. ఆయనతో షేక్ హ్యాండ్ ఇచ్చుకున్న తర్వాత.. ఆ టచ్ చేసిన చేయిని నేను రెండు రోజులు కడగలేదు.. ఫ్రెండ్స్ కి చూపిస్తూ ఇది నాగార్జున టచ్ చేసిన చేయని చాలా గర్వంగా చెప్పుకున్నాను" అంటూ కామెంట్ చేసింది.. ఈ మధ్యకాలంలో ఎప్పుడైనా కలిసారా ?అని ప్రశ్నించగా.. చాలా రోజులు అయిపోయింది. ఒకసారి వెళ్లి కలవాలి అనిపిస్తుంది.. కానీ ఏదైనా సాకు దొరకాలి కదా వెళ్లి కలవాలి అంటే అంటూ ఫన్నీగా సమాధానం ఇచ్చింది. అదే ఇంటర్వ్యూలో ఆయన గురించి మీరు ఏమనుకుంటున్నారు ? అని ప్రశ్నించగా.. మా జనరేషన్లో ఆయన హీరో మాత్రమే కాదు క్రష్ కూడా.. ఇప్పుడు కూడా యువతలో ఆయనకు అదే క్రేజ్ ఉంది. వయస్సు పెరిగినా.. అందం ఏమాత్రం తగ్గలేదు .. అంటూ తెలిపింది. నాగార్జునతో రొమాంటిక్ సీన్ చేయమంటే చేస్తారా? అని ప్రశ్నించగా.. అది బెస్ట్ థింగ్.. అలాంటి అవకాశం వస్తే ఎవరైనా వదులుకుంటారా.. నాగార్జున జెంటిల్మెన్ మాత్రమే కాదు ప్రొఫెషనల్ కూడా.. ఆయనతో నటించడం ఎవరికైనా కంఫర్ట్ గానే ఉంటుంది. నేను ఎప్పటికీ సిద్ధమే అంటూ సమాధానం ఇచ్చింది కస్తూరి శంకర్. ఇక కస్తూరి శంకర్ చేసిన కామెంట్లు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. కస్తూరి శంకర్ విషయానికి వస్తే.. మోడల్ గా, కెరియర్ మొదలుపెట్టి టెలివిజన్ వ్యాఖ్యాతగా మారి హీరోయిన్గా తన కెరియర్ను ముందుకు కొనసాగిస్తుంది. తమిళ్, తెలుగు, మలయాళం, కన్నడ భాష చిత్రాలలో నటిస్తున్న ఈమె స్టార్ మా టీవీలో ప్రసారమవుతున్న ఇంటింటి గృహలక్ష్మి సీరియల్లో తులసి పాత్రతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయింది. మద్రాస్ ఉన్నత పాఠశాలలో ఉండగానే మోడలింగ్ ప్రారంభించిన ఈమె.. 1992లో మిస్ మద్రాస్ టైటిల్ కూడా సొంతం చేసుకుంది. వ్యక్తిగత విషయానికి వస్తే 2000 సంవత్సరంలో డాక్టర్ రవికుమార్ ను వివాహం చేసుకుంది. ఈ దంపతులకు ఒక కొడుకు, కుమారుడు ఉండగా.. కుమార్తె ఇటీవల లుకేమియా నుండి బయటపడింది.

## సుశాంత్‌ది హత్యే: సోదరి



నటుడు సుశాంత్ సింగ్ రాజ్ పుత్ ఆత్మహత్య చేసుకుని మరణించాడని దర్యాప్తు సంస్థలు డిక్లేర్ చేసి కేసును ముగించాయి. ఈ కేసు నుంచి రియా చక్రవర్తి, ఆమె సోదరుడు నిరపరాధులుగా బయటపడ్డారు. వారికి సీబీఐ క్లీన్ చిట్ ఇచ్చింది. అయినా ఇప్పటికీ అతడి ఆత్మహత్యను కుటుంబీకులు అంగీకరించలేకపోతున్నారు. ముఖ్యంగా సుశాంత్ సింగ్ సోదరి శ్వేతా సింగ్ కీర్తి ఇటీవల జర్నలిస్ట్ శుభంకర్ మిశ్రాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో.. సుశాంత్ ఆత్మహత్య చేసుకునేందుకు ఆస్కారం లేదని, అతడిని ఇద్దరు కలిసి చంపారని వ్యాఖ్యానించారు. అమెరికాలో ఒకరు, ముంబైలో మరొకరు ఇద్దరు మానసిక నిపుణులు తన సోదరుడిని ఇద్దరు వ్యక్తులు హత్య చేశారని తనకు స్వయంగా వెల్లడించినట్టు చెప్పారు. బాంద్రాలోని తన ఫ్లాట్ లో ఉరి వేసుకున్న ఫ్యాన్ కు మృతదేహం ఉన్న దూరానికి ఎక్కడా పొంతన లేదని, ఇది చూస్తే ఆత్మ హత్యకు ఆస్కారమే కనిపించలేదని మానసిక నిపుణులు చెప్పినట్టు శ్వేతా సింగ్ వాదిస్తున్నారు. వారి ప్రకారం సుశాంత్ సింగ్ ను ఇద్దరు వ్యక్తులు హత్య చేశారని శ్వేతా సింగ్ ఆరోపించారు. అంత ఎత్తులోని ఫ్యాన్ కు ఉరి వేసుకోవాలంటే ఒక స్టూల్ లాంటిది వాడాలి. కానీ అక్కడ ఎలాంటి స్టూల్ లేదు. శరీరంపై ఉన్న గుర్తులను చూసాను.. అవి దుపట్టా గుర్తుల్లా కనిపించలేదు. అతడు ఉపయోగించాడని చెబుతున్న వస్తువు తాలూకా గుర్తులు కూడా లేవు. ఒక సన్నని గొలుసు లాంటి గుర్తు మాత్రమే ఉంది... దీనివల్ల తనను హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నట్టు శ్వేతాసింగ్ వ్యాఖ్యానించారు. అయితే మానసిక నిపుణులు చెప్పారు అనేదానికి శ్వేతాసింగ్ ఎటువంటి ఆధారాలు సమర్పించలేదు.

## డాక్టర్ నుంచి యాక్టర్‌గా.. మమిత బైజు

మాలీవుడ్ బ్యూటీ మమిత బైజు టాలీవుడ్ లో సినిమాలు చేయకముందే యువతలో ఫాలోయింగ్ సంపాదించిన బ్యూటీ. మాలీవుడ్ అనువాద చిత్రం %-%ప్రేమలు%-%తోనే బోలెడంత ఫేమస్ అయిపోయింది. అప్పటి నుంచి అమ్మడికి యువతలో మంచి క్రేజ్ ఏర్పడింది. ఇటీవల రిలీజ్ అయిన



డ్యూడ్ తోనూ మరో బ్లాక్ బస్టర్ అందుకుంది. ఇందులో అమ్మడు ప్రదీప్ రంగనాథ్ కు జోడీగా నటించి మెప్పించింది. ఈ సినిమా ఇప్పటికే 100 కోట్ల క్లబ్ లో చేరింది. తమిళ సినిమా అయినా తెలుగు ప్రేక్షకులకు బ్రహ్మరథం పట్టడంతో ఇంత పెద్ద విజయం సాధ్యమైంది. ఇక తెలుగు లో అవకాశాలు రావడం పెద్ద విషయం కాదు. ఇప్పటికే కొన్ని అవకాశాలు కూడా వచ్చినా రిజెక్ట్ చేసింది. నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు మాత్రమే పోషించాలి అనే కండీషన్ తో పని చేస్తుంది. ఈ నేపథ్యంలో గ్లామర్ పాత్రల్లో నటించే అవకాశాలను మమిత రిజెక్ట్ చేసినట్లు ప్రచారంలో ఉంది. అయితే ఈ బ్యూటీ గురించి తాజాగా ఓ ఇంట్రెస్టింగ్ విషయం వెలుగులోకి వచ్చింది. మమితా బైజు తండ్రి డాక్టర్. సొంతంగా ఓ క్లినిక్ కూడా ఉంది. మమిత క్లినిక్ కి వెళ్లిన సమయంలో బేబి డాక్టర్ అని పిలిచేవారట.



## సెలబ్రిటీల పెళ్లిళ్లు అంతా ఫేక్: నోరా ఫతేహి

సినీ ఇండస్ట్రీలో సెలబ్రిటీలు చేసుకునే పెళ్లిలంతా ఫేక్ అంటూ ఒక బాలీవుడ్ బ్యూటీ చేసిన కామెంట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. ఆమె ఎవరో కాదు నోరా ఫతేహి. 'సినీ పరిశ్రమలో ఎంతోమంది వ్యక్తులు తమతో సంబంధం కలిగి ఉండటానికి నకిలీ సంబంధాలను ఏర్పరచుకుంటున్నారో చెప్పడం నాకు ఇష్టం లేదు .ముఖ్యంగా బాలీవుడ్ లో సెలబ్రిటీల వివాహాలు నిజమైనవి కావు. ఇమేజ్ ప్రభావం కోసం మాత్రమే పెళ్లిళ్లు జరుగుతాయి.. ఇలాంటి ప్రవర్తన అనైతికమైనది. చివరికి నిజంగా ప్రేమించిన వారు మోసపోతున్నారు. కొంతమంది నటులు వృత్తిపరమైన ప్రయోజనాలు పొందడానికి మాత్రమే ప్రేమలో ఉన్నట్లు నటిస్తారు. మరి కొంతమంది బహిరంగంగా వివాహాలు చేస్తుంటారు. కానీ ఈ బహిరంగ వివాహాల వెనుక వివాహేతర సంబంధాలను దాచిపెడుతున్నారు.. అందుకే ఇక్కడ సెలబ్రిటీల పెళ్లిలన్నీ ఫేక్' అంటూ సంచలన కామెంట్లు చేశారు నోరా ఫతేహి.



## రష్మిక మూవీ.. సామ్ రిజెక్ట్ చేసిందా?

స్టార్ హీరోయిన్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న వరుస సినిమాలతో దూసుకుపోతున్న విషయం తెలిసిందే. అటు భారీ పాన్ ఇండియా ప్రాజెక్టుల్లో నటిస్తూనే.. ఇటు లేడీ ఓరియంటెడ్ చిత్రాల్లో కూడా సందడి చేస్తున్నారు. ఇటీవల థామా మూవీతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రష్మిక మందన్న.. మరికొద్ది రోజుల్లో ది గర్ల్ ఫ్రెండ్ తో సినిమాతో రానున్నారు. నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తెరకెక్కిస్తున్న ఆ సినిమాలో లీడ్ రోల్ లో కనిపించనున్నారు. దసరా మూవీ ఫేమ్ దీక్షిత్ శెట్టి కీలక పాత్రలో సందడి చేయనున్నారు. ఇప్పటికే అన్ని పనులు పూర్తి చేసుకున్న ది గర్ల్ ఫ్రెండ్.. నవంబర్ 7వ తేదీ వరల్డ్ వైడ్ గా రిలీజ్ కానుంది. ఇప్పటికే ఆడియన్స్ లో మంచి బజ్ క్రియేట్ చేసుకుంది. అయితే ది గర్ల్ ఫ్రెండ్ మూవీని ముందు స్టార్ హీరోయిన్ సమంత రిజెక్ట్ చేశారని, ఆ తర్వాత రష్మిక ఓకే చేశారని కొద్ది రోజుల క్రితం సోషల్ మీడియాలో ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. దీంతో ఇప్పుడు ఆ విషయంపై రాహుల్ రవీంద్రన్ ఓ ఇంటర్వ్యూలో క్లారిటీ ఇచ్చారు. తాను సినిమాలో మొదటగా హీరోయిన్ ను సమంత అనే అనుకున్నానని ఆయన తెలిపారు. కానీ ఆమె కథ మొత్తం చదివిన తర్వాత, తాను గర్ల్ ఫ్రెండ్ సినిమా చేయడానికి కరెక్ట్ కాదని తెలిపినట్లు చెప్పారు. తాను కాకుండా వేరే హీరోయిన్ ఎవరైనా చేస్తేనే బాగుంటుందని సామ్ చెప్పినట్లు వెల్లడించారు. ఆ తర్వాత రష్మిక మందన్నను అప్రోచ్ చేసి సెలెక్ట్ చేశామని తెలిపారు.






# వుమెన్ వరల్డ్ కప్ ఫైనల్ రద్దయితే..?

మహిళల వన్డే ప్రపంచకప్ 2025 తుది దశకు చేరుకుంది. ఆదివారం నవీ ముంబై వేదికగా జరిగే ఫైనల్‌తో ఈ మెగా టోర్నీకి తెరపడనుంది. టైటిల్ ఫైట్‌కు టీమిండియాతో పాటు సౌతాఫ్రికా అర్హత సాధించాయి. తొలి సెమీఫైనల్లో ఇంగ్లండ్‌ను మట్టికరిపించి సౌతాఫ్రికా ఫైనల్ చేరగా.. రెండో సెమీఫైనల్లో డిఫెండింగ్ ఛాంపియన్ ఆసీస్‌ను భారత్ చిత్తు చేసింది. 339 పరుగుల రికార్డ్ లక్ష్యాన్ని ఛేదించి సగర్వంగా ఫైనల్ చేరింది. అయితే ఫైనల్ మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. భారీ వర్షం లేకున్నా.. చిరు జల్లులు మ్యాచ్‌కు అంతరాయం కలిగించే ఛాన్స్ ఉంది. గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో కూడా చిరు జల్లులు పడ్డాయి. కానీ మ్యాచ్‌కు ఎలాంటి అంతరాయం కలగలేదు. కానీ ఆదివారం 30-60 శాతం వర్షం పడే ఛాన్స్ ఉందని ఆక్యూవెదర్ పేర్కొంది. ఉష్ణోగ్రతలు గరిష్టంగా 30 డిగ్రీల సెల్సియస్, కనిష్టంగా 25 డిగ్రీల సెల్సియస్‌గా ఉంటాయని అంచనా వేసింది. అయితే ఈ మ్యాచ్‌కు సోమవారం(నవంబర్ 3) రిజర్వ్‌డేగా కేటాయించారు.

**రిజర్వ్ డే కూడా..**

ఆదివారం కనీసం 20 ఓవర్ల ఆట సాధ్యం కాకపోతే.. ఆగిపోయిన ఓవర్ల నుంచే రిజర్వ్ డే అయిన సోమవారం ఆటను కొనసాగిస్తారు. ఒక సారి టాస్ వేస్తే.. ఆ మ్యాచ్‌ను లైవ్‌గా పరిగణిస్తారు. దురదృష్టకరమైన విషయం ఏంటంటే సోమవారం కూడా వర్షం పడే ఛాన్స్ ఉంది. అయితే మ్యాచ్ రద్దయ్యే భారీ వర్ష సూచన అయితే లేదు. ఇది అభిమానులకు ఉపశమనం ఇస్తోంది. ఒకవేళ రిజర్వ్ డే కూడా ఆట సాధ్యం కాకుండా మ్యాచ్ రద్దయితే ఐసీసీ రూల్స్ ప్రకారం ఇరు జట్లను విజేతగా ప్రకటిస్తారు. రెండు రోజుల్లో డక్‌వర్త్ లూయిస్ పద్దతిన ఇరు జట్లు కనీసం 20 ఓవర్లు ఆడేలా చూస్తారు. అది కూడా సాధ్యం కాకపోతేనే మ్యాచ్‌ను రద్దు చేస్తారు. కానీ మహిళల వన్డే ప్రపంచకప్ 2025 టోర్నీ ఫైనల్‌కు అలాంటి పరిస్థితి అయితే లేదు. 20 ఓవర్ల చొప్పున కనీసం 20 ఓవర్ల ఆట అయినా సాధ్యమవుతుంది.

**రెట్టించిన ఆత్మవిశ్వాసంతో భారత్**

పటిష్టమైన ఆసీస్ ఓడించి ఫైనల్ చేరిన భారత్ ఆత్మవిశ్వాసం రెట్టింపు అయ్యింది. ఫైనల్లో సౌతాఫ్రికాని ఓడించడం భారత్‌కే ఏం కష్టం కాకపోవచ్చు. కానీ సెమీఫైనల్ తరహాలో సమష్టిగా రాణిస్తేనే విజయం దక్కుతుంది. క్రీజులో సెట్ అయిన బ్యాటర్ చివరి వరకు ఉండాలి. కట్టడిగా బౌలింగ్ చేయాలి. భారత్ తరహాలో సౌతాఫ్రికా కూడా ఇప్పటి వరకు మహిళల వన్డే ప్రపంచకప్ గెలవలేదు. ఆ జట్టు కూడా తొలి టైటిల్ కోసం గట్టిగా పోరాడనుంది. సౌతాఫ్రికా జట్టు గ్రూప్ దశలో 7 మ్యాచ్‌లలో 5 గెలిచి సెమీఫైనల్ చేరగా.. భారత్ జట్టు మాత్రం 7 మ్యాచ్‌ల్లో 3 గెలిచి 3 ఓడింది. ఒక మ్యాచ్ వర్షంతో రద్దయ్యింది. సౌతాఫ్రికా జట్టులో కెప్టెన్ లారా వోల్వార్ట్ అద్భుతమైన ఫామ్‌లో ఉండగా.. టీమిండియాలో స్మృతి మంధాన, జెమీమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్‌తో పాటు, యువ ఆటగాళ్ల నిలకడైన ప్రదర్శన టీమిండియాకు ప్రధాన బలంగా మారింది. సొంత మైదానంలో ప్రేక్షకుల మద్దతు కూడా భారత జట్టుకు గొప్ప ప్రేరణ అవుతుంది. అంతేకాకుండా నవీ ముంబై వేదికగానే గత నాలుగు మ్యాచ్‌లను భారత్ ఆడటం కలిసొచ్చే అంశం. భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:00 గంటలకు ఫైనల్ మ్యాచ్ ప్రారంభమవుతుంది. అరగంట ముందు 2:30 గంటలకు టాస్ వేస్తారు.




## చెత్త బ్యాటింగ్..

# టీమిండియా చిత్తు!



ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లోనూ టీమిండియా శుభారంభం అందుకోలేకపోయింది. తొలి టీ20 వర్షార్పణం కాగా.. రెండో టీ20లో ఆసీస్ 4 వికెట్ల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. చెత్త బ్యాటింగ్ టీమిండియా ఓటమిని శాసించింది. ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌లో ఆసీస్ 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది.

**ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ 18.4 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ అభిషేక్ శర్మ(37 బంతుల్లో 8 ఫోర్లు, 2 సిక్స్‌లతో 68) ఒక్కడే హాఫ్ సెంచరీతో రాణించగా.. హర్షిత్ రాణా(33 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 35) అతనికి అండగా నిలిచాడు. మిగతా బ్యాటర్లంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు.**

ఇందులో ముగ్గురు బ్యాటర్లు ఖాతా కూడా తెరవలేదు. ఆసీస్ బౌలర్లలో జోష్ హజెల్‌వుడ్(3/13) మూడు వికెట్లు తీయగా.. గ్జేవియర్ బార్ట్‌లెట్, నాథన్ ఎల్లిస్ రెండేసి వికెట్లు తీసారు. మార్కస్ స్టోయినీస్ ఒక వికెట్ తీసాడు. పరిస్థితులను గౌరవించకుండా దూకుడుగా ఆడి భారత బ్యాటర్లు మూల్యం చెల్లించుకున్నారు. అనంతరం ఆస్ట్రేలియా 13.2 ఓవర్లలో 6 వికెట్లకు 126 పరుగులు చేసి గెలుపొందింది. కెప్టెన్ మిచెల్ మార్ష్(26 బంతుల్లో 2 ఫోర్లు, 4 సిక్స్‌లతో 46) తృటిలో హాఫ్ సెంచరీ చేజార్చుకోగా.. ట్రావిస్ హెడ్(15 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 28) దూకుడుగా ఆడాడు. భారత బౌలర్లలో జస్‌ప్రీత్ బుమ్రా(2/26), వరుణ్ చక్రవర్తి(2/23), కుల్దీప్ యాదవ్(2/43) రెండేసి వికెట్లు తీసారు. పవర్ ప్లేలో కాస్త కట్టడిగా బౌలింగ్ చేసినా.. బ్యాటింగ్‌లో మరో 20 పరుగులు చేసినా ఫలితం మరోలా ఉండేది. స్వల్ప లక్ష్యచేధనలో ఆసీస్‌కు అదిరిపోయే ఆరంభం దక్కింది. ఓపెనర్లు మిచెల్ మార్ష్, ట్రావిస్ హెడ్ దూకుడుగా ఆడారు. దాంతో 4.3 ఓవర్లలోనే ఆసీస్ 51 పరుగులు చేసింది. తిలక్ వర్మ స్టన్నింగ్ క్యాచ్‌కు ట్రావిస్ హెడ్ వెనుదిరగ్గా.. జోష్ ఇంగ్లీస్‌తో కలిసి మిచ్ మార్ష్ చెలరేగాడు. హాఫ్ సెంచరీ ముంగిట అతన్ని కుల్దీప్ యాదవ్ ఔట్ చేయగా.. టీమ్ డేవిడ్‌ను వరుణ్ పెవిలియన్ చేర్చాడు. జోష్ ఇంగ్లీస్(20)ను కుల్దీప్ యాదవ్ ఔట్ చేయగా.. మిచెల్ ఓవెన్‌ను బుమ్రా కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. కానీ చేయాల్సిన లక్ష్యం తక్కువగా ఉండటంతో ఆసీస్‌కు ఎలాంటి ఇబ్బంది లేకుండా పోయింది. మాథ్యూ షార్ట్‌ను బుమ్రా క్లీన్ బౌల్డ్ చేయగా.. మార్కస్ స్టోయినీస్ క్విక్ డబుల్ తీసి విజయలాంఛనాన్ని పూర్తి చేశాడు. బ్యాటింగ్‌లో రాణించిన హర్షిత్ రాణా బౌలింగ్‌లో మాత్రం దారుణంగా విఫలమయ్యాడు.

## హాఫ్ సెంచరీతో ఆదుకున్న అభిషేక్ శర్మ

ఆచితూచి ఆడిన అక్షర్ పటేల్(7) అనవసర పరుగుకు ప్రయత్నించి రనౌట్‌గా వెనుదిరిగాడు. దాంతో భారత్ 49 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ పరిస్థితిల్లో హర్షిత్ రాణాతో కలిసి అభిషేక్ శర్మ జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. తనదైన శైలిలో బౌండరీలు బాదిన అభిషేక్..23 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. మరో ఎండ్‌లో హర్షిత్ రాణా కూడా పరుగులు రాబట్టాడు. ఈ ఇద్దరూ 6వ వికెట్‌కు 56 పరుగులు జోడించిన తర్వాత హర్షిత్ రాణాను గ్జేవియర్ బార్ట్‌లెట్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత వచ్చిన శివమ్ దూబే(4), కుల్దీప్ యాదవ్(0) తీవ్రంగా నిరాశపర్చగా.. వరుణ్ చక్రవర్తి(0) సాయంతో అభిషేక్ శర్మ దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాడు. కానీ అతన్ని నాథన్ ఎల్లిస్ అద్భుతమైన యార్కర్‌తో పెవిలియన్ చేర్చాడు. క్రీజులోకి వచ్చిన జస్‌ప్రీత్ బుమ్రా రనౌటవ్వడంతో భారత్ 125 పరుగులకు కుప్పకూలింది.




## ఆ మాటలు గెలవాలనే కసిని పెంచాయి: హర్మన్

హెడ్ కోచ్ అమోల్ ముజుందార్ మాటలే తమకు స్పూర్తిని కలిగించాయని టీమిండియా మహిళల కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. 339 పరుగుల లక్ష్యాన్ని చేధించగలమనే భరోసా ముజుందార్ తన మాటలతో కల్పించాడని చెప్పుకొచ్చింది. మహిళల వన్డే ప్రపంచకప్ 2025లో భాగంగా గురువారం ఆస్ట్రేలియాతో జరిగిన సెమీఫైనల్లో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో ఆసీస్‌ను ఓడించి ఫైనల్ చేరిన విషయం తెలిసిందే. ఈ విజయానంతరం తీవ్ర భావోద్వేగానికి గురైన హర్మన్‌ప్రీత్ కౌర్.. హెడ్ కోచ్ అమోల్ ముజుందార్ పెప్ టాక్ గెలవాలనే కసిని పెంచిందని చెప్పుకొచ్చింది. అమోల్ ముజుందార్‌తో కలిసి స్టార్ స్పోర్ట్స్‌తో ప్రత్యేకంగా మాట్లాడిన హర్మన్‌ప్రీత్ కౌర్ ఆసక్తికర విషయాలు పంచుకుంది. 'ఇంగ్లండ్‌తో ఓటమి తర్వాత నేను ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఎందుకంటే మా కోచ్ ముజుందార్ మాట్లాడారు. మీరు మ్యాచ్‌ను గెలిపించి ఉండాల్సింది అని అన్నారు. ప్రతీ ఒక్కరు ఆయన మాటలను సానుకూలంగా తీసుకున్నారు. మా కోచ్ ఏది చెప్పినా మేం నమ్ముతాం. ఎందుకంటే ఆయన ఎప్పుడూ హృదయపూర్వకంగా మాట్లాడుతారు. ఆ తర్వాతే నేను ఆటగాళ్లతో చర్చిస్తాను. వారు ఏం ఫీల్ అవుతున్నారో నేను తెలుసుకుంటాను. మా కోచ్ ఎప్పుడూ మా నుంచి సానుకూల ఫలితాలనే ఆశిస్తారు. ఆయనే కాదు ఈ దేశం మొత్తం అదే ఆశిస్తోంది. జట్టులో ప్రతీ ఒక్కరు సానుకూలంగా ఉన్నారు. ఆస్ట్రేలియాతో నేటి మ్యాచ్‌లో ఆ మార్పును చూడవచ్చు.'అని హర్మన్‌ప్రీత్ కౌర్ పేర్కొంది. అంతకుముందు ఈ గెలుపు గురించి మాట్లాడేందుకు మాటలు రావడం లేదని హర్మన్‌ప్రీత్ కౌర్ తెలిపింది. 'ఈ గెలుపు పట్ల చాలా గర్వంగా ఉంది. నా భావాలను వ్యక్తపరిచేందుకు మాటలు రావడం లేదు. చాలా గొప్పగా అనిపిస్తోంది. ఎన్నో ఏళ్లుగా ధాటని గీతను అధిగమించాం. విజయం తర్వాత మా కోచ్‌తో ఇదే చెప్పాను. ఈ గెలుపు కోసం మా కోచ్‌తో పాటు నేను చాలా కష్టపడ్డాను. ఎలాంటి పరిస్థితుల్లోనైనా మ్యాచ్ గెలవగలమనే నమ్మకం మాకు ఉంది. ఈ టోర్నీలో మేం కొన్ని పొరపాట్లు చేశాం. కానీ వాటి నుంచి పాఠాలు నేర్చుకున్నాం.




## జెమీమా లెక్కలతో షాక్ అయ్యా..



ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో మా ప్రణాళికలను సరిగ్గా అమలు చేయలేదు. కానీ ఈ మ్యాచ్‌లో ఆ తప్పిదాన్ని సవరించుకున్నాం. కొన్ని ఓవర్ల ముందే మ్యాచ్‌ను ముగించాం. జెమీమా రోడ్రిగ్స్ అద్భుతంగా ఆడింది. ఆమె ఎప్పుడూ జట్టు క్షేమం కోరుకునే వ్యక్తి. లెక్క ప్రకారం ఆడుతోంది. జట్టు విజయంలో బాధ్యత తీసుకోవాలని ఆరాటపడుతోంది. ఆమెపై మాకు ఎప్పుడూ ఆ నమ్మకం ఉంది. మేం ఇద్దరం అద్భుతమైన భాగస్వామ్యం నెలకొల్పాం. ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగాం. ఐదు పరుగులు వచ్చాయి.. ఇంకా రెండు బంతులు ఉన్నాయని జెమీమా చెబుతూ ఉంటుంది. ఆమెతో బ్యాటింగ్ భలే ఉంటుంది.ఆమె ఆలోచన విధానం చూసి ఆశ్చర్యపోయాను. ఈ గెలుపు క్రెడిట్ ఆమెదే. మా లక్ష్యాన్ని చేరుకునేందుకు ఇంకో మ్యాచ్(ఫైనల్) ఉంది. ఈ రోజు మేం బాగా ఆడాం. ఫలితం పట్ల చాలా సంతోషంగా ఉన్నాం. కానీ తదుపరి మ్యాచ్ గురించి మాట్లాడటం మొదలు పెట్టాం.

## ఒకట్రెండు రోజుల్లో ఆసియా కప్ ట్రోఫీ భారత్‌కు: బీసీసీఐ

ఆసియా క్రికెట్ కౌన్సిల్ చీఫ్ నఖ్వీ ఒకటి లేదా రెండు రోజుల్లో ఆసియా కప్ ట్రోఫీని భారత్‌కు అప్పగించే అవకాశముందని బీసీసీఐ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. ఆసియా కప్ ఫైనల్‌లో పాకిస్థాన్‌పై టీమ్ఇండియా విజయం సాధించి ట్రోఫీని సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. అయితే దాదాపు నెలరోజులు గడుస్తున్నా.. ఇంకా ట్రోఫీ, మెడల్స్‌ను అందించకపోవడంపై బీసీసీఐ సెక్రటరీ దేవజిత్ సైకియా అసంతృప్తి వ్యక్తం చేశారు. నవంబర్ 4న ఐసీసీ త్రైమాసిక సమావేశం జరగనుంది. ఈలోగా నఖ్వీ.. ఆ ట్రోఫీని భారత్‌కు అప్పగించాలని, లేకపోతే ఈ విషయాన్ని ఐసీసీ దృష్టికి తీసుకువెళతామని ఆయన హెచ్చరించారు. 'దాదాపు నెల గడుస్తున్నా.. ఇప్పటికీ ఆసియా ట్రోఫీని మాకు అందించలేదు. ఇది సరికాదు' అని సైకియా ఓ న్యూస్ ఏజెన్సీతో అన్నారు. అలాగే ట్రోఫీ విషయమై ఏసీసీకి లేఖ పంపిన విషయాన్నీ ధ్రువీకరించారు. అయితే దానికి బదులుగా నఖ్వీ.. ఏసీసీ కార్యాలయంలోనే ట్రోఫీని తీసుకోవాలని బదులిచ్చినట్లు తెలిపారు. 'మేం ఏసీసీ ఛైర్మన్‌కు ఆసియా కప్ ట్రోఫీ విషయమై లేఖ పంపాం.

ఈవార్తలు
ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
శనివారం 1-11-2025 | www.evarthalu.com



# విద్యార్థి.. గతి తప్పిన విద్య!

పుస్తకాల మధ్య దాగిన భయం,
పరీక్షల గదిలో గుండెల దడ,
మార్కుల మాయలో మునిగిన బాల్యం,
ఆత్మహత్యలు... ఎందుకు ఈ దారుణం?
తల్లి కడుపు నుండి పుట్టిన కలలు,
పాఠశాలలో పాతిపెట్టిన ఆశలు,
“నీవు ఫస్ట్ రా!” అనే ఒత్తిడి శాపం,
చదువు అనే యుద్ధంలో చచ్చిన బతుకులు.
ర్యాంకుల రాక్షసుడు నవ్వుతుంటే,
బాలుడు గోడకు తగిలిన రక్తం చూస్తాడు,
అమ్మ నాన్న కలలు నెరవేర్చలేక,
తన గొంతు కోసుకుని పడిపోతాడు.
ఎందుకు ఈ పోటీ? ఎవరి కోసం?
చదువు జీవితం కాదు, జీవితం చదువు!
మార్కుల కంటే మనిషి గొప్ప,
ఒత్తిడి తగ్గించండి, ప్రాణాలు కాపాడండి.
ఓ విద్యార్థీ! నీలో దాగిన శక్తి చూడు,
వైఫల్యం అంతం కాదు, ప్రారంభం మాత్రమే,
ఆత్మహత్య కాదు పరిష్కారం..!

విద్యార్థి జీవితం జ్ఞాన సముపార్జనకు అతి ముఖ్యమైన దశ. కానీ ఈ దశలో మానసిక ఆరోగ్యం కీలక పాత్ర పోషిస్తుంది. మానసిక ఆరోగ్యం అంటే కేవలం మానసిక రుగ్మతలు లేకపోవడమే కాదు, ఒత్తిడిని ఎదుర్కొని సానుకూలంగా జీవించగల సామర్థ్యం. భారతదేశంలో విద్యార్థులలో 40% మంది మానసిక సమస్యలతో బాధపడుతున్నారని లాన్సెట్ జర్నల్ (2023) నివేదిక తెలిపింది.

ఆధునిక విద్యా వ్యవస్థలో విద్యార్థులు ఎదుర్కొంటున్న అతి పెద్ద సవాలు తీవ్ర ఒత్తిడి. పరీక్షలు, పోటీ, తల్లిదండ్రుల అంచనాలు, సోషల్ మీడియా ప్రభావం.. ఇవన్నీ కలిసి విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కుంగదీస్తున్నాయి. భారతదేశంలో ప్రతి సంవత్సరం వేలాది మంది విద్యార్థులు ఒత్తిడి వల్ల ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. జాతీయ నేర రికార్డుల బ్యూరో డేటా ప్రకారం, 2022లో 13,000కు పైగా విద్యార్థులు ఒత్తిడి కారణంగా ప్రాణాలు కోల్పోయారు. విద్యార్థులపై బహుముఖ కారణాల వల్ల ఒత్తిడి పెరుగుతోంది.

పోటీతత్వం, పరీక్షల భయం: జేఈఈ, నీట్, యూపీఎస్సీ వంటి ప్రవేశ పరీక్షలు లక్షల మంది విద్యార్థులను పోటీ పరుస్తాయి. కోచింగ్ సెంటర్లు, ర్యాంకులు, కటాఫ్ మార్కులు %-% ఇవి నిరంతర ఒత్తిడిని కలిగిస్తాయి. ఉదాహరణకు, కోటా (రాజస్థాన్)లో ప్రతి సంవత్సరం డజన్ల కొద్దీ ఆత్మహత్యలు జరుగుతున్నాయి.

1. తల్లిదండ్రుల అంచనాలు: చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలను డాక్టర్, ఇంజినీర్ లేదా %×ూూ% అధికారి చేయాలని కలలు కంటారు. ఇది విద్యార్థుల స్వేచ్ఛను హరిస్తుంది. ఒక సర్వే ప్రకారం, 70% విద్యార్థులు తల్లిదండ్రుల ఒత్తిడి వల్ల మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు.
2. సోషల్ మీడియా , సమకాలీన పోలికలు: ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి ప్లాట్‌ఫాంల్లో ఇతరుల సక్సెస్ స్టోరీలు చూసి స్వయం అపనమ్మకం తగ్గుతుంది. ఒత్తిడి పెరుగుతుంది.
3. విద్యా విధాన లోపాలు: రోట్ లెర్నింగ్, మార్కుల ఆధారిత మూల్యాంకనం విద్యార్థుల సృజనాత్మకతను అణచివేస్తుంది. పాఠశాలల్లో కౌన్సెలింగ్ సౌకర్యాలు తక్కువ.

## సమగ్ర విధానం అవసరం

జాతీయ విద్యావిధానం- 2020లో సూచించినట్లు స్కిల్-బేస్డ్ ఎడ్యుకేషన్, హెూలిస్టిక్ డెవలప్‌మెంట్‌ను ప్రోత్సహించాలి. పరీక్షల సంఖ్య తగ్గించి, ప్రాజెక్ట్-బేస్డ్ లెర్నింగ్ పెంచాలి. ప్రతి పాఠశాల, కాలేజీలో ప్రొఫెషనల్ కౌన్సెలర్లు ఉండాలి. యోగా, మెడిటేషన్ క్లాసులు తప్పనిసరి చేయాలి. వర్క్ షాప్‌ల ద్వారా తల్లిదండ్రులకు ఒత్తిడి ప్రమాదాలు గురించి తెలియజేయాలి. పిల్లల ఆసక్తులను గౌరవించాలి. పోమోడారో టెక్నిక్ వంటివి ఉపయోగించి చదువును సమతుల్యం చేయాలి. స్పోర్ట్స్, మ్యూజిక్, ఆర్ట్ వంటివి ఒత్తిడిని తగ్గిస్తాయి. స్నేహితులు, టీచర్లతో మాట్లాడాలి. ప్రభుత్వాలు మానసిక ఆరోగ్యాన్ని ప్రాధాన్యతగా చేసి, బడ్జెట్ కేటాయింపులు పెంచాలి.

## చివరగా..

విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి కేవలం వ్యక్తిగత సమస్య కాదు, సామాజిక సమస్య. ఇది దేశ భవిష్యత్తును ప్రభావితం చేస్తుంది. విద్యను ఆనందదాయకంగా, సృజనాత్మకంగా మార్చడం ద్వారా మాత్రమే ఈ సమస్యను అధిగమించవచ్చు. ప్రతి విద్యార్థి “మార్కులు” కాకుండా “మనిషి”గా ఎదగాలి. సమాజం మొత్తం కలిసి పనిచేస్తే, మన విద్యార్థులు ఒత్తిడి బారిన పడకుండా సంతోషంగా ఎదుగుతారు.

**- జ్ఞానేశ్వర్ తాటిపాముల**

## ....సుప్రీం కోర్టు మార్గదర్శకాలు....

1. అన్ని విద్యాసంస్థలూ ఏకరూప మానసిక వైద్య విధానాన్ని అనుసరించాలి. ఉమ్మీద్ ముసాయిదా మార్గదర్శకాలు, మనోదర్పణ్ కార్యక్రమం, జాతీయ ఆత్మహత్యల నివారణ వ్యూహం నుంచి సూచనలు తీసుకొని విద్యార్థుల మానసిక ఆరోగ్య మెరుగుదలకు చర్యలు చేపట్టాలి.
2. 100 మంది, అంతకుమించి విద్యార్థులున్న అన్ని విద్యాసంస్థలూ కనీసం ఒక క్వాలిఫైడ్ కౌన్సెలర్, సైకాలజిస్ట్, సామాజిక కార్యకర్తను నియమించుకొని విద్యార్థుల మానసిక ఆరోగ్యాన్ని కాపాడాలి. తక్కువ మంది విద్యార్థులున్న సంస్థలు బయట ఉన్న మానసిక ఆరోగ్య నిపుణులతో పిల్లలకు కౌన్సెలింగ్ ఇప్పించాలి.
3. పిల్లలు పరీక్షల ఒత్తిడికి లోనవకుండా చూడటానికి మానసిక కౌన్సెలర్‌కు బాధ్యతలు అప్పగించాలి.
4. అన్ని విద్యాసంస్థలూ, ముఖ్యంగా కోచింగ్ సెంటర్లు విద్యార్థులను ప్రతిభ ఆధారంగా బ్యాచ్‌ల వారీగా విభజించడం, అందరి ముందు కించపరచడం, వారి సామర్థ్యంతో సంబంధం లేకుండా చదువులో లక్ష్యాలు విధించడం లాంటివి సాధ్యమైనంత వరకూ మానుకోవాలి.
5. మానసిక ఆరోగ్య సేవలు, స్థానిక ఆసుపత్రులు, ఆత్మహత్యల నిరోధ హెల్ప్‌లైన్ నంబర్లను హాస్టళ్లు, తరగతి గదులు, కామన్ ఏరియాల్లో ప్రదర్శించాలి.
6. అన్ని విద్యాసంస్థల్లోని బోధన, బోధనేతర సిబ్బందికి ఏడాదికి కనీసం రెండుసార్లు మానసిక ప్రథమ చికిత్స (సైకలాజికల్ ఫస్ట్ ఎయిడ్), హెచ్చరిక సంకేతాల గుర్తింపు, స్వీయహాని సమయంలో స్పందించడంపై శిక్షణ ఇప్పించాలి.
7. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడినవారు, దివ్యాంగులు, అనాథలు, ఆత్మన్యూనతతో ఉన్నవారు ఇలా అన్ని వర్గాల పిల్లలను కలుపుకొనిపోయేలా విద్యాసంస్థలు తమ సిబ్బందికి శిక్షణ ఇప్పించాలి.
8. ర్యాగింగ్, లైంగిక దాడులు, వేధింపులపై వచ్చే ఫిర్యాదులను తక్షణం పరిష్కరించి, బాధితులకు అండగా నిలబడేందుకు అన్ని విద్యాసంస్థలూ పటిష్ఠమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలి. ఇలాంటి విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడితే యాజమాన్యానిదే బాధ్యతని స్పష్టం చేయాలి.
9. విద్యార్థులపై అవాంఛనీయ ఒత్తిడి తేకుండా తల్లిదండ్రులు, సంరక్షకులను అప్రమత్తం చేసే కార్యక్రమాలను విద్యాసంస్థలు నిర్వహించాలి.
10. ఎంతమంది విద్యార్థులకు మానసిక వైద్యసేవలందించారో ఒక రహస్య నివేదిక రూపొందించి.. కేంద్ర, రాష్ట్ర విద్యాశాఖలు, యూజీసీ, ఏఐసీటీఈ, సీబీఎస్ఈ బోర్డులకు అందించాలి.
11. విద్యాసంస్థలు క్రీడలు, కళలు, వ్యక్తిత్వవికాస కార్యక్రమాల నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాలి.
12. విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు.. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, సంరక్షకులకు కెరీర్ కౌన్సెలింగ్ ఇవ్వాలి. పిల్లలకు నచ్చిన కెరీర్‌ను ఎంచుకొనేందుకు మద్దతివ్వాలి.
13. గురుకుల విద్యాసంస్థలు, హాస్టల్ యజమానులు, వార్డెన్లు, కేర్‌టేకర్లు విద్యాప్రాంగణాలను వేధింపులు, దాడులు, డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దాలి.
14. అన్ని గురుకుల విద్యాలయాలు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడడానికి వీల్లేని విధంగా సీలింగ్ ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి. క్షణికావేశంలో స్వీయహాని తలపెట్టుకోకుండా చూసేందుకు భవనాల పైకప్పులు, బాల్కనీల్లోకి వెళ్లకుండా నిరోధించాలి.
15. జైపుర్, కోటా, సికర్, చెన్నై, హైదరాబాద్, దిల్లీ, ముంబయి నగరాలతోపాటు పోటీపరీక్షలకు సమాయత్తం కావడానికి విద్యార్థులు పెద్దఎత్తున తరలివెళ్లే ప్రాంతాల్లో వారి ఆత్మహత్యలు ఎక్కువగా జరుగుతున్నాయి. అలాంటిచోట్ల ప్రత్యేక దృష్టి సారించాలి.




## జైళ్లలా కార్పొరేట్ విద్య

విరామం లేని తరగతులు.. నాసిరక భోజనం.. నిద్రలేని రాత్రులు.. అర్ధరాత్రి 11 వరకు క్లాసులు.. ఇప్పుడు కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో పరిస్థితి ఇదే. ఒక్క ముక్కలో చెప్పాలంటే కార్పొరేట్ కాలేజీలన్నీ జైళ్లలా మారిపోయాయి. నిద్రలేని రాత్రులు విద్యార్థుల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. విద్యార్థులు రోజుకు 16 గంటల పైగా చదువుకు కేటాయిస్తున్నారు. ఐఐటీ, జేఈఈ, నీట్ లక్ష్యంగా నిర్వహించే ప్రత్యేక తరగతులు వారి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. అల్పాహారం, భోజన సమయాల మినహా ఇతర సమయాల్లో నిరంతరం పాఠాలు. కొన్ని రోజులకే తల్లిదండ్రులకు ‘ఇక ఉండలేము’ అంటూ ఏడ్చే పరిస్థితి వస్తోంది. విడుదల లేని ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం, దూపహారక అలవాట్లు లేకపోవడం వల్ల పిల్లల్లో విటమిన్ డీ లోపం, ఊబకాయం, మానసిక నలివిడి సమస్యలు పెరుగుతున్నాయి. కాలేజీల్లో కౌన్సిలింగ్ సేవలు లేకపోవడం వల్ల సమస్యలు తీవ్రరూపం దాలుస్తున్నాయి. అనుమతులు లేకపోయినా, అధిక అంతస్తుల అపార్ట్‌మెంట్లలో హాస్టళ్లు నిర్వహిస్తూ ఒక్కో గదిలో ఎనిమిది మందిని కుక్కేస్తున్నారు. ఫైర్ సేఫ్టీ సౌకర్యాలు లేకుండా నడుస్తున్న ఈ హాస్టళ్లు విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారుతున్నాయి. లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నా, కనీస మౌలిక వసతులు కల్పించడంలో కార్పొరేట్ యాజమాన్యం విఫలమవుతోంది. ప్రభుత్వం ఈ హాస్టళ్లపై చర్యలు తీసుకోవడంలో విఫలమవుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని విద్యార్థుల జీవితాలను కాపాడాలి.


**- పవన్ రేగొండి, విద్యార్థి నాయకుడు**

# దేవుత్తని ఏకాదశి

హిందువులకు ఎంతో పవిత్రమైన మాసం కార్తీక మాసం. ఈ మాసంలో ఏకాదశి, ద్వాదశి, సోమవారాలు, పౌర్ణమి రోజులు ఎంతో విశేషమైనవిగా పండితులు భావిస్తారు. అయితే.. నవంబర్ 1న దేవుత్తని ఏకాదశి. కార్తీక మాసం శుక్లపక్షంలో వచ్చే ఏకాదశిని ఉత్థాన ఏకాదశి లేదా ప్రబోధిని ఏకాదశి అంటారు. వైదిక పంచాంగం ప్రకారం.. కార్తీక శుక్ల ఏకాదశి తిథి 2025 నవంబర్ 1 సూర్యోదయ సమయం నుంచి ప్రారంభమై.. నవంబర్ 2వ తేదీ ఉదయం 07.31 గంటల వరకూ ఉంటుందని పండితులు చెబుతున్నారు. కాబట్టి నవంబర్ 1వ తేదీన దేవుత్తని ఏకాదశిని పాటిస్తారు.



**రాం మనోహర్ శర్మ బండపెల్లి**
ఆధ్యాత్మిక పండితుడు



నవంబర్ 1న దేవుత్తని ఏకాదశి రోజు శ్రీమహావిష్ణువు యోగ నిద్ర నుంచి మేల్కొంటారని మన పురాణాల ద్వారా తెలుస్తుంది. కాబట్టి ఈ కార్తీక మాసం శుక్ల ఏకాదశి తిథి శనివారం నవంబర్ 1వ తేదీ ఉపవాసం ఆచరించడం శుభప్రదమని పండితులు చెబుతున్నారు. అంతే కాకుండా ఈ రోజున భక్తి శ్రద్ధలతో ఉపవాసం ఉండి శ్రీమహావిష్ణువును పూజించడం వల్ల సర్వపాపాలు నశిస్తాయని చెబుతారు. ముఖ్యంగా ఈ రోజున ఉపవాస దీక్ష పాటిస్తే వేయి అశ్వమేధ యాగాలు, వంద రాజసూయ యాగాలు చేసినంత ఫలితం కలుగుతుందని పెద్దల మాట. మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఆషాఢ శుద్ధ ఏకాదశికి శ్రీమహావిష్ణువు యోగ నిద్రలోని వెళ్లినప్పుడు ఆగిన శుభకార్యాలు.. చాతుర్మాస్య వ్రత దీక్ష ముగిసిన అనంతరం కార్తీక శుక్ల ఏకాదశి రోజు శ్రీమహావిష్ణువు యోగ నిద్ర నుంచి మేల్కొనడంతో శుభకార్యాలు సైతం ప్రారంభమవుతాయి. కార్తీక శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువును మేల్కొలిపేందుకు బ్రహ్మాది దేవతలతో పాటు, మునులు, మహర్షులు విష్ణులోకానికి వెళతారట. వీళ్లంతా మృదంగ వాయిద్యాలతో కీర్తనలు పాడుతూ, భజనలు చేసుకుంటూ, నాట్యం చేస్తూ వెళ్లి శ్రీమహావిష్ణువుని మేల్కొలుపుతారట. ఆ తర్వాత పరమేశ్వరుడు, విష్ణుమూర్తిని పూజించి హారతి ఇవ్వగా.. బ్రహ్మ వేదాలు పఠించాడని పురాణోక్తి. అప్పటి నుంచే పూజా కార్యక్రమాల్లో హారతి ఇచ్చే సంప్రదానం మొదలైందని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ దేవుత్తని ఏకాదశి రోజున ఉపవాసం ఆచరించడం వల్ల సిరిసంపదలు, సుఖశాంతులు లభిస్తాయని విశ్వాసం. ఆ మరుసటి అంటే ద్వాదశి రోజున దేవాలయాల్లో తులసి వివాహాన్ని ఘనంగా జరిపిస్తారు. అంతే కాకుండా ఉత్థాన ఏకాదశి రోజున చేసే దానధర్మాలకు ఎంతో విశిష్టత ఉంది. ఈ ఏకాదశి రోజున దానధర్మాలు, పుణ్యకార్యాలు చేసేవారి ఇంట్లో ధన ధాన్యాలకు, సిరిసంపదలకు, సుఖసంతోషాలకు, ఐశ్వరానికి లోటుండదని ప్రగాఢ విశ్వాసం. అంతే కాకుండా కార్తీక ఏకాదశి రోజు ఉపవాసం ఉండి విష్ణుమూర్తిని ఆరాధించడం వల్ల కోరికలు నెరవేరుతాయని కూడా నమ్మకం. ఇంతటి పవిత్రమైన రోజున బ్రహ్మ ముహూర్తంలో నిద్రలేచి పవిత్ర స్నానం చేసి ఇంటిని శుభ్రం చేసుకుకోవాలి. శ్రీహహావిష్ణువును స్మరించుకుంటూ విగ్రహం లేదా చిత్రపటం ముందు ఆవు నెయ్యితో దీపాలను వెలిగించి పూజ చేయాలి. అనంతరం విష్ణు సహస్రనామం పఠించాలి.

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.